# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :190 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 28-09-2024 పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళం

హైదరాబాద్,వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధి కి రిలయన్స్ ఫౌండేషన్ భారీ విరాళాన్ని అందజేసింది. రూ.20 కోట్ల చెక్కును సీఎంఆర్ఎఫ్‌కు అందజేశారు. శుక్రవారం ఉదయం రిలయన్స్ ఫౌండేషన్‌కు చెందిన ప్రతినిధులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎంను కలిసి ఆయనకు రూ.20 కోట్ల చెక్కును అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద సంభవించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం జిల్లా పూర్తిగా నీట మునిగింది. అనేక మంది ఇళ్లను కోల్పోయారు. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు చిరంజీవి, బాలకృష్ణ, ఎన్టీఆర్, మహేశ్ బాబు, సాయిధరమ్‌తేజ్, విశ్వక్‌సేన్ సహా పలువురు విరాళాలు అందించారు.

## ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్ ప్రారంభించిన పొన్నం



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గల్ఫ్ బాధితుల కోసం ప్రవాసి ప్రజావాణి అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రజావాణి కార్యక్రమం మాదిరిగానే ఈ కార్యక్రమం ప్రతి బుధ, శుక్రవారాలు ప్రభుత్వం నిర్వహించనుంది. గల్ఫ్ బాధితులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రవాసి ప్రజావాణి వేదికగా ఉంటుంది.

మొదటి అభ్యర్థన స్వీకరించిన మంత్రి పొన్నం

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రవాసి ప్రజావాణి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్నాషేక్ హుస్సేన్ కుటుంబం నుండి మొదటి అభ్యర్థనను మంత్రి పొన్నం ప్రభాకర్ స్వీకరించారు. సమస్యల వినతి కోసం గల్ఫ్ కార్మికులు భారీగా పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా గల్ఫ్ కార్మికులు సమస్యలపై పెద్ద ఎత్తున తరలి వచ్చి ఫిర్యాదు ఇచ్చారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికే : మంత్రి

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో చెప్పినట్టు నాలుగు అంశాల పై నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రం నుండి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున ఉపాధి నిమిత్తం వెళ్ళారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. గల్ఫ్ ప్రమాదంలో చనిపోయిన వారికి 5 లక్షల ఎక్స్ గ్రేషియ ఇవ్వడానికి ఇప్పటికే జీవో జారీ చేసుకున్నామని చెప్పారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లల చదువులకు ఇబ్బందులు లేకుండా గురుకులాల్లో సీట్లు కల్పిస్తున్నామని తెలిపారు. గల్ఫ్ కార్మికుల కోసం ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

## లంగర్‌హౌస్‌లో మూసీ నిర్వాసితుల ఆందోళన..

హైదరాబాద్: మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగుతున్నది. ఆపరేషన్ మూసీ పేరుతో తమ ఇండ్లకు మార్కింగ్ చేయడంపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే చేయడానికి వస్తున్న అధికారులను అడ్డుకుంటున్నారు. మూసీ సుందరీకరణకోసం తమ బతుకులను ఛిద్రం చేస్తున్నారంటూ మండిపడితున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనబాటపట్టారు. ఇందులో భాగంగా లంగర్‌హౌస్ పీఎస్ పరిధిలో మూసీ నిర్వాసితులు ధర్నాకు దిగారు.

లంగర్‌హౌస్‌లోని డిఫెన్స్ కాలనీ వాసులు రింగు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమకు అన్యాయం చేస్తున్నదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంతి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.కాగా, దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురి, సత్యా నగర్, మారుతీ నగర్‌లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. భారీ బందోబస్తు మధ్య ఇండ్లకు మార్కింగ్ చేస్తున్నారు. దీంతో స్థానికులు వారిని అడ్డుకుంటున్నారు. ఇక్కడి నుంచి ఎక్కడికీ వెళ్లేది లేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తమకు అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాపాలన, ఇందిరమ్మ



పాలన అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రాణాలైనా ఇస్తాం కానీ, అక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెడుతున్నారు. ఇక్కడ అందరం కాంగ్రెస్ వాళ్లమేనని, మార్పు మార్పు అని ఓట్లు వేస్తే రోడ్ల మీద పడ్డామని వాపోయారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎలా చనిపోయాడో రేవంత్ రెడ్డి కూడా అలా చనిపోతాడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## డిక్లరేషన్ కోరే హక్కు టిటిడికి లేదు

తిరుపతి,సెప్టెంబర్27: జగన్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వ పతనం ఖాయమనిహెచ్చరించారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోతే దర్శనానికి అనుమతి లేదనే హక్కు టీటీడీకి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా శ్రీవారిని దర్శించుకోవచ్చని సనాతన ధర్మం చెబుతోందని తెలిపారు. అలాంటిది ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పట్టు వస్త్రాలు సమర్పించిన జగన్‌ను డిక్లరేషన్ అడగడం దారుణమని విమర్శించారు. జగన్ డిక్లరేషన్‌పై ఇంత రాద్దాంతం జరిగినా చంద్రబాబు మాట్లాడటం లేదని భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. డిక్లరేషన్ వెనుక రాజకీయ కుట్ర ఉందని తెలిపారు. ప్రభుత్వం ఎంత నిర్బంధిస్తే అంత పైకి లేస్తామని హెచ్చరిం చారు. చంద్రబాబు పాశవిక విధానాలను వ్యతిరేకిస్తూనే ఉంటామని భూమన తెలిపారు. చంద్రబాబు వెయ్యి నాలుకల ధోరణిని ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటన ఆసక్తి రేపుతోన్న వేళ.. టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత భూమన కరుణాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్ ను డిక్లరేషన్ అడిగే హక్కు టీటీడీకి లేదన్నారు. ఐదుసార్లు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తిని ఎలా అడిగుతారు డిక్లరేషన్ అని నిలదీశారు.. టీటీడీ డిక్లరేషన్ అడిగితే ఈ ప్రభుత్వం పతనం ప్రారంభం అయినట్లే అవుతుందన్నారు.. ఇక, సోనియా గాంధీ డిక్లరేషన్ పెట్టలేదు.. దానికి సాక్షం నేనే అన్నారు.. తిరుమలకు నడిచివెళ్లే అడిగే అధికారం కూడా టీటీడీకి లేదన్నారు.. కానీ, వైఎస్ జగన్ కాలినడకన తిరుమల వెళ్తారని ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.. ఒక భక్తుడిగా వెంకన్న క్షేత్రానికి జగన్ వస్తున్నారు.. దర్శనానికి వస్తుంటే అడుగు అడుగునా ఆటంకం సృష్టిస్తున్నారు.. చంద్రబాబు చెప్పినట్లు పోలీసులు మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులను హౌస్ అరెస్ట్ చేశారు.. నగర వైసీపీ నేతలను, కార్యకర్తలు బెదిరిస్తున్నారు.. భయభ్రాంతులకు గురి చేస్తూ నోటీసులు ఇచ్చారు.. అసలు జగన్ అంటే ఎందుకు చంద్రబాబుకు భయం అని ప్రశ్నించారు.. భగవంతుని పట్ల అంతంతమాత్రమే నమ్మకం ఉన్న సూడో మనుషులు.. జగన్ డిక్లరేషన్ ఇవ్వాలని చెబుతున్నారని భూమన దుయ్యబట్టారు.. హిందూ ధర్మానికి విరుద్ధంగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారు. ఐదు సార్లు సీఎం హోదాలో



స్వామివారికి పట్టు వస్త్రాలు జగన్ సమర్పించారని గుర్తుచేశారు.. లడ్డూ ఘటనలో డిఫెన్స్‌లో పడిపోయి ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు.. పూజలు కూడా చేయకుండా ఇంటిలోనే ఉండాలని వైసీపీ నేతలను అడ్డుకుంటున్నారు. వైసీపీ నేతలు పూజలు కూడా చేయకూడదా? ఎందుకు మీకు అంతా భయం..? అని నిలదీశారు.. 40 శాతం ఓట్లు సాధించిన జగన్ వెంటా ఎవరు లేరని చెప్పడానికి కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.. అది జరగని పని.. వ్యక్తిగత రాజకీయాల్లోకి దేవుడిని తీసుకుని రాకండి. చంద్రబాబు ఒకటి చేబితే.. పవన్ కల్యాణ్ మరొకటి చెబుతాడు.. హైందవ ధర్మాన్ని పవన్ ఒక్కడే కాపాడేవాడిలా మాట్లాడుతున్నాడు అంటూ ఎద్దేవా చేశారు..వైఎస్ జగన్ తిరుమల వస్తుంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ సన్నాయి నొక్కలు నోక్కుతున్నాడు.. మేమే హిందువులు అన్నట్లుగా బీజేపీ నేతలు మాట్లాడుతు న్నారని భూమన అన్నారు. సనాతన ధర్మం పై మాకు విశ్వాసం ఉంది? చంద్రబాబు స్వయంగా జగన్ రావాలని ఆహ్వానం పంపాలి. జగన్ ను అడ్డుకుంటే సనాతన ధర్మాన్ని వ్యతిరేకించినట్లే.. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు.. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన జగన్ స్వామివారిని దర్శనం చేసుకునే వెళ్తారని స్పష్టం చేశారు.. చంద్రబాబు సైలెంట్ గా ఉండి మిత్ర పక్షాలను, పోలీసులను రెచ్చగొడుతున్నారు. నిన్నటి వరకు లడ్డూతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు.. లడ్డూలో పస తగ్గడంతో ఇప్పుడు డిక్లరేషన్ అంటూ మొదలెట్టారు అంటూ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు..

## తిరుపతి లడ్డూ కల్తీ వివాదం వేళ.. అయోధ్య రామ మందిరం కీలక నిర్ణయం



లక్నో: భక్తులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం వేళ అయోధ్య రామ మందిరం నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బాల రాముడికి బయటి సంస్థలు తయారుచేసిన ప్రసాదాలను నైవేద్యంగా పెట్టడంపై నిషేధం విధించారు. ఆలయ పూజారుల సమక్షంలో తయారుచేసిన ప్రసాదాలనే బాలరాముడికి నైవేద్యంగా పెట్టాలని, భక్తులకు ప్రసాదంగా అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు.మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు ఉపయోగించారన్న ఆరోపణలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ఈ లడ్డూ కల్తీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

అదే సమయంలో ఆలయాల్లో పెట్టే ప్రసాదం స్వచ్ఛతపై భక్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అయోధ్య ఆలయ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా విక్రయిస్తున్న నెయ్యి స్వచ్ఛతపై రామ మందిరం ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ అనుమానం వ్యక్తం చేశారు. 'దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలు, మఠాల్లో బయట ఏజెన్సీలు తయారు చేసిన ప్రసాదాలను పూర్తిగా నిషేధించాలి. దేవుళ్లకు ప్రసాదం ఆలయ అర్చకుల పర్యవేక్షణలోనే తయారు చేయాలి. అటువంటి ప్రసాదాన్ని మాత్రమే సమర్పించాలి' అని ఆయన అన్నారు.అదే సమయంలో తిరుపతి బాలాజీ లడ్డూ ప్రసాదంలో కొవ్వు, మాంసాహారం వినియోగిస్తున్నారనే ఆరోపణలపై దేశవ్యాప్తంగా వివాదా లు తీవ్రమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా భక్తులు, సాధుసన్యాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్లో అమ్ముతున్న నూనె, నెయ్యిల నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## తిరుపతి లడ్డూ వివాదం.. ప్రకాశ్ రాజ్ మరో ట్వీట్..

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ మహాప్రసాదం కల్తీ ఘటనపై ఎక్స్ వేదికగా తొలుత తన అభిప్రాయాన్ని పంచుకున్న నటుడు ప్రకాశ్ రాజ్.. ఆ తరువాత నుంచి వరుస పోస్టులు పెడుతున్నారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడినట్లు ల్యాబ్ రిపోర్టులు రావడంతో పవన్ కల్యాణ్ లడ్డూ వివాదంపై తొలుత ట్వీట్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి.. దోషులకు శిక్షపడాలనే ఉద్దేశంతో ట్వీట్ లో పేర్కొన్నారు. సినీ నటుడు ప్రకాశ్ రాజ్ స్పందించారు. పవన్ కల్యాణ్ పేరును ప్రస్తావిస్తూ మత పరమైన ఉద్రిక్తతలు చాలు కేంద్రంలో ఉన్న మీ స్నేహితులకు ధన్యవాదాలు అంటూ పేర్కొన్నాడు. ప్రకాశ్ రాజ్ పోస్టుపై పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ప్రకాశ్ రాజ్ మీకు ఏం కావాలి.. సున్నితాంశాలపై తెలుసుకొని మాట్లాడాలని పవన్ హితవు పలికారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని పవన్ హెచ్చరించారు. ఆ తరువాత ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. ఎక్స్ వేదికగా పవన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. తాను విదేశాల్లో ఉన్నానని, ఇండియాకు వచ్చాక పవన్ కల్యాణ్ ప్రశ్నలకు సమాధానమిస్తానంటూ పేర్కొన్నారు.గురువారం ప్రకాశ్ రాజ్ మరో ట్వీట్ చేశారు. గెలిచే ముందు ఒక అవతావరం.. గెలిచిన తరువాత ఇంకో అవతారం.. ఏంటీ అవాతారం.. ఎందుకు మనకీ అయోమయం.. ఏది నిజం? జస్ట్ ఆస్కింగ్.. అంటూ పేర్కొన్నాడు. తాజాగా శుక్రవారం ఉదయంసైతం మరో ట్వీట్ చేశారు. మనకేం కావాలి.. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి.. తద్వారా రాజకీయ లబ్ధిని సాధించటమా..? లేక ప్రజల మనోభావాలు గాయపడకుండా.. పరిపాలనా సంబంధమైన అవసరమైతే తీవ్రమైన చర్యలతో సున్నితంగా



సమస్యను పరిష్కరించుకోవటమా? జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్ రాజ్ పేర్కొన్నాడు. అయితే, ఆయన ఈ రెండు పోస్టుల్లోనూ ఎవరు పేరును ప్రస్తావించలేదు.. దీంతో ఆయన ఎవరిని ఉద్దేశించి పోస్టు పెట్టారు? ఎందుకు పెట్టారు.. అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.ప్రకాశ్ రాజ్ చేసిన ట్వీట్ పై పవన్ కల్యాణ్ స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రకాశ్ రాజ్ నాకు మంచి మిత్రుడు. రాజకీయంగా మాకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒకరి పట్ల ఒకరికి ఎంతో గౌరవం ఉంది. తిరుపతి లడ్డూ విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. దోషులకు శిక్షపడాలనే ఉద్దేశంతో నేను పోస్టు పెట్టా. కానీ ప్రకాశ్ రాజ్ ఢిల్లీలో మీ స్నేహితులంటూ కామెంట్ చేయాల్సిన అవసరం లేదు. ఆయన పోస్టును నేను తప్పుగా ఏమీ అర్థం చేసుకోలేదు.. నాకు ఆయన ఉద్దేశం అర్థమైందని పవన్ అన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి సీఎం రేవంత్,కెటిఆర్ నివాళి..





హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు అందించారని స్మరించుకున్నారు. తెలంగాణ కోసం తపించిన బాపూజీ అడుగుజాడల్లో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆయన సేవలు నిరంతరం గుర్తుండాలన్న లక్ష్యంతోనే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు రేవంత్. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేక్, మైనంపల్లి రోహిత్, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ : కెటిఆర్

ప్రజా పోరాట యోధుడు మన కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు కెటిఆర్ . 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి మొదలుకొని మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు.. ప్రజా ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆయన నివాసంలోనే పురుడు పోసుకుందన్నారు. రాష్ట్ర సాధన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఆ మహనీయుడిని సమున్నతంగా గౌరవించిందని చెప్పారు. ట్యాంక్ బండ్ వద్ద వారి విగ్రహం ఏర్పాటు చేసిందని, వారి పేరు హార్టికల్చరల్ యూనివర్సిటీకి పెట్టిందని గుర్తుచేశారు.

### చెన్నూరు కోర్టులో స్వచ్ఛభారత్..

చెన్నూర్,చెన్నూర్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి న్యాయవాదులతో కలిసి ఇవాళ ఉదయం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా కోర్టు ఆవరణలో ఉన్న చెత్త చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు.ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టుకున్నట్లయితే సీజనల్ వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాంబాబు,కార్తీక్, మహేష్, మల్లేశం గౌడ్,కోర్టు సిబ్బంది

## వైసీపీ హయాంలో అవినీతి పెరిగి రాష్ట్రం నష్టపోయింది



అమరావతి : ఐదేండ్ల వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి పెరిగి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యురాలు పురంధేశ్వరి ఆరోపించారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే నాడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం విజయవాడలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ వల్ల నిలిచిపోయిన పోలవరాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పోలవరానికి కేంద్రం రూ. 12 వేల కోట్లు మంజూరు చేసిందన్నారు. అమరావతి నిర్మాణానికి ఇప్పటి వరకు కేంద్రం 15 వేల కోట్లు ఇవ్వనుందని తెలిపారు. అమరావతి అభివద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## సంపాదకీయం

**శనివారం 28-09-2024**

# మేడిపండు చందంగా చిత్రపరిశ్రమ !

చిత్ర పరిశ్రమ..అది దేశంలో ఏభాషలో అయినా కావచ్చు..ఆడవాళ్లను లొంగదీసుకోకుండా నడిచిన దాఖలాలు లేవు. చిత్రపరిశ్రమలోకి ఉత్సాహంగా వచ్చిన మగువలను మృగాళ్లు..వదలడం లేదు. అక్కడ విలువలు మృగ్యం. మగ పెత్తనమే ఎక్కువ. ఆడవాళ్లంటే నీచాతినీచంగా వ్యవహరిస్తున్న ఘటనలు ఎన్నో చూశాం. ఓ రకంగా సమాజంలో మగసామ్రాజ్యం ఎక్కడైనా ఉందంటే అది చిత్ర పరిశ్రమ అని చెప్పక తప్పదు. ఇటీవల మాలీవుడ్ అంటే..మళయాలంలో కాస్ట్‌కౌచింగ్ దుమారం రేపింది. కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక తర్వాత ఒక్కసారిగా అగ్నిపర్వతం బద్దలయ్యింది. అక్కడ జరుగుతున్న దారుణాలు బయటపడ్డాయి. నీతి వాక్యాలు వల్లించే వారి బండారం బయటపడింది. అమ్మ కమిటీకి మోహన్ లాల్ రాజీనామా చేశారు. వాడుకోవడం ...వదిలేయడం చిత్రపరిశ్రమలో షరామూమూలు అన్న ప్రచారం ఉండనే ఉంది. ఈ క్రమంలో వివిధ సినీ కమిటీల బాధ్యులు లైంగిక వేధింపుల, దాడుల ఆరోపణలని ఎదుర్కొని రాజీనామా చేశారు. కొంతమందిపై కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ చిత్ర పరిశ్రమలోని స్త్రీల పని పరిస్థితులు బాగుచెయ్యటానికి అనేక కొత్త సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వం విధిలేని పరిస్థితిలో కార్యాచరణకు పూనుకుంది. ఇదే క్రమంలో నటీమణులు ఒక్కొక్కరుగా తమకు జరిగిన అనుభవాలను, బాధలను బయటపెడుతున్నారు. నిజానికి ఆడవాళ్లు ధైర్యం చేసి చిత్రపరిశ్రమలోకి రాకుంటే...విర్రవీగుతున్న మగాళ్లు ఏమవుతారు. ఆడవేశాలు కూడా వారే వేసుకుంటారా అన్నది ఆలోచన చేయాలి. స్త్రీలు భీష్మించుకుని చిత్రరంగంలోకి రాకుంటే ..డ్రామా కంపెనీల్లాగా చిత్రపరిశరమ దుర్గతిని ఎదుర్కోక తప్పదు. నీతి వాక్యాలు వల్లిచే హీరోలు, నిర్మాతలు, దర్శకులు దీనిపై ఆలోచన చేయాలి. చిత్రపరిశ్రమను ఆదర్శం గా నిలపడానికి కృషి చేయాలి. పని స్థలాల్లో స్త్రీల లైంగిక వేధింపుల గురించి తెలుగు సమాజాల్లో జరుగుతున్న చర్చ దేశంలో ఇతర చోట్ల జరుగుతున్న చర్చలకి పూర్తి వ్యతిరేకంగా ఉంది. బెంగాల్‌లో ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటన తర్వాత ఆ రాష్ట్రంలో హింసా సంస్కృతి గురించే కాకుండా, పని స్థలాల్లో లైంగిక వేధింపులు, దాడుల్ని సమర్థించే సంస్కృతి గురించి అందరూ మాట్లాడుతున్నారు. వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఎంతోమంది వాదిస్తున్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్న..కుక్కతోక వంకర అన్న చందంగా మన దగ్గర మాత్రం ఇలాంటి చర్చలు జరగటం లేదు. పరిశ్రమలో ఆడవాళ్ళ పని పరిస్థితుల గురించి అస్సలు ఎవ్వరూ మాట్లాడటంట్లేదు. వారిని తోటివారుగా గౌరవించడం లేదు. ఇలా తమిళనాడు, బాలీవుడ్, ఒక్కటేమిటి అన్ని భాషల్లోనూ చిత్రపరిశ్రమలోకి రావాలనుకున్న...వచ్చిన మహిళలు వివక్షను, వేధింపులను ఎదుర్కొంటున్నారు. నిజానికి పనిప్రదేశాల్లో అన్ని చోట్లా ఇదే దుస్థితి ఉంది. కాకపోతే చిత్రపరిశ్రమలో కాస్తా ఎక్కువగా ఉంటుందని చర్చించుకోవాల్సి వస్తోంది. తెలుగు సినిమా పరిశ్రమలో పేరున్న డాన్స్ మాస్టర్ జానీ మీద అతని అసిస్టెంట్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, దాడికి సంబంధించిన ఫిర్యాదు గురించిన చర్చ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో వందలాది మందిని కదిలించింది. అయ్యో జానీ మాస్టార్ అంటూ నీతులు వల్లిస్తున్నారు. ఆ అమ్మాయి సొంతంగా బతుకీదుద్దామనుకుంటున్న తరుణంలో కూడా వేధింపులకు పాల్పడ్డ జానీ తీరును ఖచ్చితంగా ఎండగట్టాల్సిందే. ఆమె ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే ..ఎందుకు ఫిర్యాదు చేసింది..ఇన్నాళ్లూ ఇష్టంతోనే అతడితో ఉంది కదా? ఆమెను ఎవరు వాడుకుంటున్నారు. అతని పట్ల అసూయతోనే ఈ ఫిర్యాదు చేయించారు అంటూ నస పెడుతున్న వారు నిజాలు ఆలోచన చేయాలి. ఇటువంటి వాదనలతో నిజాలను పక్కదారి పట్టించలేరు. సోషల్ మీడియా ఇదే వాస్తవమన్న అభిప్రాయాన్ని కలుగచేస్తోంది. తెలుగు సినిమా పెద్దలు కూడా నేరం రుజువయితేనే అతని మీద చర్యలు తీసుకోవాలి అంటూ ఆయనకి పరోక్షంగా మద్దతు కూడగడుతున్నారు. జానీ మాస్టర్ అలా చేయడని కొందరు వంతపాడుతున్నారు. ఎవరు ఎలాంటి వారన్నది ఇలా ఆరోపణలు యటకు వచ్చినప్పుడే కదా తెలిసేది. 2018లో శ్రీరెడ్డి, ఇతర కళాకారులు తెలుగు సినీ పరిశ్రమలోని పురుషాధిపత్య సంస్కృతినీ, లైంగిక దాడీనీ తమ నిరసనల ద్వారా అందరి ముందుకీ తెచ్చారు. అప్పుడు ఆమెను వెక్కిరించినవారు, ఈసడించుకున్న వారే ఎక్కువ. డ్రగ్స్‌తో పట్టుబడ్డప్పుడు కూడా ఇలాగే వాదిస్తున్నారు. కానీ నిజాలను ఒపపుకోరు. తమకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని బతుకుతున్నారు. దాని జోలకి ఎవరూ రావద్దని వారు కోరుకుంటున్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో ఉన్న పరిస్థితి ప్రకారం కొత్తవాళ్ళకి పని చేసే అవకాశం రావాలన్నా, లేక అసోసియేషన్ కార్డు పొందాలన్నా కోఆర్డినేటర్లపైనా, పైనున్న మగ మాస్టార్లపైనా ఆధార పడాలి. వారికి లొంగి ఉంటేనే అసలు పనిచేసే అవకాశాలు వస్తాయి. పరిశ్రమ వారి మాటే వింటుంది. అందుకే జానీమాస్టర్ లాంటి వారు దీనిని అలుసుగా తీసుకుని లొంగగదీసుకుంటున్నారని అర్థం అవుతోంది.తనకంటే 20ఏళ్ళు చిన్నదైన అమ్మాయి, అదీ మైనారిటీ తీరని వయసులో ఉన్న అమ్మాయి పట్ల ఓ మాస్టర్ వ్యవహరించిన తీరుపైన చర్చించాలి. పరిశ్రమలో నిలబడడానికి వచ్చిన జూనియర్‌ను ప్రోత్సహించాల్సింది పోయి..బ్లాక్‌మెయిల్ చేసి కామవాంఛ తీర్చుకునే దగుల్బాజీలను ఎండగట్టాల్సిందే. సినిమా పరిశ్రమలో అత్యధిక శాతం తనకి మద్దతు ఇవ్వదని, వ్యతిరేకంగా మాట్లాడతారని తెలిసి కూడా ఆమె ఫిర్యాదుకు వచ్చిందంటే జానీ మాస్టర్ ఆమెను ఎంత తీవ్రంగా నియంత్రిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఆమెతో పాటు పని చేసే డాన్సర్లు, ఇతర సంఘాల్లో ఉండే అనేక మంది స్త్రీలు, ఇంకా చెప్పాలంటే పరిశ్రమలో దాదాపు అందరు స్త్రీలు కూడా ఇటువంటి పరిస్థితిలోనే ఉన్నారని మనం అనుకోవచ్చు. వాళ్ళు చెయ్యలేని ధైర్యం ఆమె చేసినందుకు అభినందించాలి. మాలీవుడ్ లాగా టాలీవుడ్‌లోనూ జస్టిస్ హేమ కమిటీ లాంటిది రావాలేమో. అలాంటి పరిస్థితి తెచ్చుకునే దాకా తెలుగు పరిశ్రమ రాకుండా ఉంటే మంచిది. పరిశ్రమలో ఉన్న సినీ దిగ్గజాలు ఈ దుస్థితిపై చర్చించాలి. పరిశ్రమ గౌరవాన్ని కాపాడాలి. తమకు చెడ్డపేరు రాకుండా చూసుకోవాలి. నిజానికి చెప్పాలంటే ఇలాంటి దుస్థితి అన్ని పరిశ్రమల్లో ఉంది. ఎక్కడ ఉన్నా దానిని ఎదరించాల్సిందే. నిలదీయాల్సిందే. సమర్థించే వారిని నిగ్గదీయాల్సిందే. అప్పుడే భయం అన్నది పుట్టుకుని వస్తుంది.

# లడ్డూ వివాదం...పొలిటికల్ వార్!

తిరుమల: శ్రీవారి లడ్డూ వివాదం ఏపీ రాజకీయాలను కుదిపేస్తుంది. వైసీపీ, టీడీపీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ పాలిటిక్స్‌లో హీట్ పెంచుతున్నారు. మంత్రులు, మాజీ మంత్రులే కాకుండా.. ఈ ఇష్యూలోకి సీఎం, మాజీ సీఎం కూడా ఎంట్రీ ఇచ్చి వివాదాన్ని కాస్త నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లారు. ఇక.. మాటలతో కాదు.. చేతల్లో చూపిస్తామంటూ సీఎం చంద్రబాబు సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ని నియమించారు. దీనికి ఐపీఎస్ ఆఫీసర్ అయిన సర్వ శ్రేష్ట్ త్రిపాఠిని ఇన్‌చార్జి చేశారు. అయితే.. సీఎం వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఏ విచారణకైనా సిద్ధమంటున్నారు వైసీపీ నేతలు. మొత్తంగా ఈ వ్యవహారం అంతా రాజకీయ దుమారం రేపుతూ.. లీడర్లను కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

ఉపముఖ్యమంత్రిలో ఆగ్రహజ్వాల..

గత ప్రభుత్వ హయంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన వ్యవహారాలపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కీలక సూచనలు చేశారు. టీటీడీ ఆస్తులు, భగవంతుడి ఆభరణాలకు గత ప్రభుత్వం రక్షణ కల్పించిందా? లేదా! అనే కోణంలో కూడా విచారణ అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులనే తనఖా పెట్టిన గత పాలకులు.. దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా? అనే సందేహం ప్రజల్లో ఉందని సీఎం చంద్రబాబుకు రాసిన లేఖలో ప్రస్తావించారు. టీటీడీలోని గత పాలకమండలి స్వామి వారి నిరర్థక ఆస్తులని అమ్మే ప్రయత్నం చేసిందని, తమిళనాడులో 23 ఆస్తులు, గుంటూరు, రంగారెడ్డి, హైదరాబాద్‌లో ఉన్న పలు ఆస్తులను అమ్మకానికి పెట్టారని పవన్ ఆరోపించారు. దీనికంతటికీ పూర్తిస్థాయిలో ఆధారాలున్నాయన్న పవన్ మండిపడ్డారు.

సుప్రీంకోర్టుకు చేరిన లడ్డూ వివాదం..


తిరుమల లడ్డూ వివాదంపై రాజకీయ దుమారం కొనసాగుతుండగానే.. నెయ్యి కల్తీలో తమ పాత్ర లేదని ప్రమాణం చేయడానికి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమలకు వెళ్లారు. భూమన ప్రమాణం చేస్తుండగానే పోలీసులు అక్కడి నుంచి ఆయనను తీసుకెళ్లిపోయారు. ఇక.. తిరుమల లడ్డూ కల్తీపై వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లడ్డూ వివాదంపై విచారణ జరపాలని ఆ పిటిషన్‌లో కోరారు. స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని కోర్టును ఆశ్రయించారు.

యానిమల్ ఫ్యాట్‌కే ఖరీదెక్కువన్న పొన్నవోలు..

తిరుపతి లడ్డూ వివాదంలో కూటమి సర్కారు చేస్తున్న ప్రచారాన్ని మాజీ అడ్వకేట్ జనరల్, న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తప్పుబట్టారు. కోట్లాదిమంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సర్కారు ప్రవర్తించిందని.. దీనిపై విశ్రాంత న్యాయమూర్తి లేదా సిట్టింగ్ జడ్జ్ ద్వారా నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జరుగుతున్న ప్రచారంలో నిజాలు నిగ్గు తేల్చాలని సుప్రీంకోర్టులో వైవీ సుబ్బారెడ్డి పిల్ దాఖలు చేయగా.. ఆయన తరుపును పొన్నవోలు వాదనలు వినిపించారు. వేల రూపాయల ఖరీదైన యానిమల్ ఫ్యాట్‌ను తక్కువ ధరకు వచ్చే నెయ్యిలో కలిపారని అనటం హాస్యాస్పదమన్నారు.

తప్పు కప్పిపుచ్చుకునేందుకే అన్న కాకాణి..

100 రోజుల తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే లడ్డు గురించి దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కామెంట్స్ చేశారు. లడ్డూలో



నెయ్యి కల్తీ గురించి విచారణ జరపాలని ప్రధాని మోదీకి మాజీ సీఎం జగన్ లేఖ రాశారని అన్నారు. టీటీడీ ఈఓ శ్యామలరావుని కీలు బొమ్మలా మార్చి సీఎం చంద్రబాబు ఆడిస్తున్నాడని మండిపడ్డారు. జూన్‌లో ఎవరి ప్రభుత్వం ఉంది ? ఒకవేళ ఆ నెయ్యిని జూన్, జూలై నెలల్లో వాడి ఉంటే తప్పు ఎవరిది అని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలతో ఆడుకుంది చంద్రబాబు కాదా అని దుయ్యబట్టారు.

అప్పుడెందుకు ఆరోపణలు చేయలేదన్న రోజా

ఇప్పటికే మాజీ మంత్రి రోజా టీడీపీపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ హయంలో కేంద్రమంత్రులు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు కూడా పలు సార్లు శ్రీవారిని దర్శించుకున్నారని గుర్తు చేశారు. లడ్డూ ప్రసాదంలో టేస్ట్ మారి ఉంటే.. అప్పుడెందుకు ప్రశ్నించ లేదని నిలదీశారు. సీఎం చంద్రబాబు డైవెర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఈ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చారని రోజా ఆరోపించారు.

సోనియా, అబ్దుల్ కలాం కంటే జగన్ గొప్పవారా?

ప్రధానికి జగన్ లేఖ రాయడంపై చంద్రబాబు గట్టిగా రియాక్ట్ అయ్యారు. తప్పులు చేసి తప్పించుకోవడం, ఎదురు దాడి చేయడం వైసీపీ స్టైల్ అన్నారు. తిరుమల క్షేత్రంలోని సాంప్రదాయాలను వైసీపీ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. టీటీడీ మాజీ ఈఓ ధర్మారెడ్డి తీరును తీవ్రంగా తప్పుపట్టారు. బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకొని తిరుగుతారని విమర్శించారు. భూమన కుమార్తెకు క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వివాహం చేశారని గుర్తుచేశారు. అబ్దుల్ కలాం, సోనియా కంటే జగన్, వైసీపీ నేతలు గొప్పవారా?.. తిరుమలకు వచ్చినప్పుడు ఆ ప్రొటోకాల్ ఎందుకు పాటించలేదని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

తిరుమలలో ప్రాయశ్చిత్త కార్యక్రమాలు..

తిరుమలలో ప్రాయశ్చిత్త కార్యక్రమాలు చేపట్టారు. శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలవడంతో టీటీడీ అధికారులు సంప్రోక్షణతో పాటు శాంతి హోమం నిర్వహించారు. పూర్ణాహుతి తర్వాత పంచగవ్వ ద్రవ్యాలతో ఆలయంలోని అన్ని పోట్లలో సంప్రోక్షణ చేశారు. అన్నప్రసాద పోటు, లడ్డు పోటు, ఉగ్రాణము, లడ్డు కౌంటర్లు, బూందీ పోర్టు, వరాహ స్వామి వద్ద సంప్రోక్షణ నిర్వహించారు. ఇక.. దేవుడి ప్రసాదం విషయంలో కల్తీ ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఈ వివాదం రానున్న రోజుల్లో తీవ్ర రూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది.

# ఇజ్రాయెల్-హిజ్బుల్లా వార్.. మూడో ప్రపంచ యుద్ధం ఫిక్స్?




మూడో ప్రపంచ యుద్ధం దిశగా అడుగులు పడుతున్నాయా..? పరిస్థితులన్నీ చూస్తుంటే స్పష్టంగా అవుననే అనుకోవాలి. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధంతో ఇప్పటికే మిడిల్ ఈస్ట్ రగిలిపోతుంది. ఇరాన్- ఇజ్రాయెల్ చర్యలు ఆజ్యం పోయగా.. ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధానికి అమెరికా అదనపు బలగాలు కూడా దిగుతున్నాయి. ఇది, లెబనాన్ నాశనానికి దారితీస్తుందనే సూచనలు ఉన్నాయి. ఇక, గల్ఫ్ దేశాల ప్రత్యక్ష పాత్ర మాత్రమే తేలాల్సి ఉంది. అది కూడా జరిగితే, ప్రపంచ యుద్ధానికి ఎన్నో రోజులు లేవు..? అటు ఇరాన్, రష్యాలు కాకమీద ఉన్నాయి. ఇటు అమెరికా, యూరప్ దేశాలు రెడీ అవుతున్నాయి. ప్రపంచంలో ప్రస్తుతం కనిపిస్తున్నది కొంతే.. నివురుగప్పిన నిప్పులా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివాదాలు విశ్వరూపం దాల్చే సమయం వచ్చినట్లే ఉంది.మూడో ప్రపంచ యుద్ధం తప్పదా..? ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు చూస్తే నిజమే అనిపిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మొదలైన ఈ భయం.. ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతలతో పెరిగింది. ఇక, ఇజ్రాయెల్ పై ఇరాన్ దాడి తర్వాత.. ప్రతిదాడి చేయకుండా ఇజ్రాయెల్‌ను అమెరికా ఎందుకు ఆపుతోందనే అనుమానాల మధ్య ఈ భయం కాయమయ్యింది. ప్రస్తుతం ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య నెలకొన్న తీవ్ర యుద్ధంతో భూమి మీద మూడు ప్రత్యక్ష యుద్ధాలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామం మూడో ప్రపంచయుద్ధానికి దారితీస్తుందనే సందేహాలు పెరిగాయి. ఇప్పుడు ప్రపంచదేశాలదీ అదే భయం. థార్డ్ వరల్డ్ వార్ ఇప్పుడే వస్తుందేమో అన్నట్లు ప్రధాన దేశాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. అంతర్జాతీయ ఒప్పందాల్లోనూ యుద్ధ సామాగ్రిదే అగ్ర స్థానం.. ఇలాంటి తరుణంలో ఏడాది క్రితమే ఉక్రెయిన్ డిఫెన్స్ కౌన్సిల్ హెడ్, పెద్ద బాంబ్ కూడా పేల్చాడు. 3వ ప్రపంచ యుద్ధం ఆల్రెడీ మొదలయ్యిందని వ్యాఖ్యానించారు. దానికి రుజువులు చెప్పి రెడీగా ఉండండి అంటూ హెచ్చరించాడు. అయితే, ఇవి వట్టి మాటలని కొట్టిపారేయగలమా..? .రష్యా ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మొదలై రెండేళు దాటుతోంది. ఏడాది క్రితం మొదలైన ఇజ్రాయేల్, హమాస్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. మరోవైపు, ఇరాన్, ఇరాక్, సిరియాల్లో బాంబుల మోత బెంబేలెత్తించింది. ఇక, దక్షిణాసియాలో క్షిపణులు ప్రయోగాలే కానీ, దాడులు లేవని అనుకుంటున్న తరుణంలో.. నార్త్ కొరియా-సౌత్ కొరియా బోర్డర్‌లో యుద్ధ సన్నాహం కనిపించింది. ఆమధ్య చైనా అధ్యక్షుడు తైవాన్‌ను ఆక్రమించి తీరుతామని ప్రకటించాడు. మరోవైపు, అమెరికా, యూరప్ దేశాలు దఫాల వారీగా తమ మిత్ర దేశాలకు యుద్ధ సామాగ్రిని తరలిస్తూనే ఉన్నారు. అమెరికా దాని మిత్ర దేశాలు కలసి మిడిల్ ఈస్ట్‌లో అక్కడక్కడా మిలటరీ స్థావరాలను మరింత బలోపేతం చేస్తున్నారు.ఇటీవల హౌతీ రెబల్స్ లక్ష్యంగా అమెరికా యెమెన్‌లో క్షిపణి దాడులు చేసింది. ప్రస్తుతం, ఇజ్రాయెల్-లెబనాన్ యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా అదనపు బలగాలను పంపుతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇలాంటి పరిణామాలు కనిపించడం బహుశా ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో.. ప్రపంచ దేశాల్లో.. ముఖ్యంగా మిడిల్ ఈస్ట్‌లో.. కనిపిస్తున్న పరిస్థితులన్నీ మూడో ప్రపంచ యుద్ధాన్ని నిజం చేసేలా ఉన్నాయనడంలో సందేహం లేదు. అయితే, తర్వలోనే దీని విశ్వరూపం కనిపించబోతుందా అనే డౌట్‌కు మాత్రమే ఆన్సర్ రావాల్సి ఉంది. సెప్టెంబర్ 23న, దక్షిణ, తూర్పు లెబనాన్‌తో పాటు రాజధాని బీరుట్‌ను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఇందులో, 450 మందికి పైగా మరణించారు, 1500 మంది గాయపడ్డారు. లెబనాన్‌లో ఉన్న పొలిటికల్ గ్రూప్, షియా మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా సభ్యులను చంపడానికి ఇటీవల పేజర్‌లను ఆయుధాలుగా ఉపయోగించిన ఇజ్రాయెల్.. ఆ దాడి తర్వాత చేపట్టిన వైమానిక దాడులు ఇప్పటికే ఉన్న శత్రుత్వాన్ని మరింత తీవ్రంగా మార్చాయి. ఇజ్రాయెల్, హిజ్బుల్లా సంవత్సరాలుగా ఇజ్రాయెల్‌తో ఉన్న లెబనాన్ దక్షిణ సరిహద్దులో రాకెట్ కాల్పులు గత కొన్నేళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. అయితే, అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లో హమాస్ దాడులకు ప్రతీకారంగా, గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ప్రారంభించినప్పటి నుండి, హమాస్ మిత్రపక్షమైన హిజ్బుల్లా రాకెట్ ప్రయోగాలను మరింతగా పెంచింది. దీనితో, ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. ఫలితంగా, లక్షకు పైగా లెబనీయన్లు, దాదాపు 60 వేల మంది ఇజ్రాయిలీలు అంతర్గతంగా తమ నివాసాలను వదిలి వెళ్లిపోయారు.గత వారం, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాల్లంట్ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం “కొత్త దశ”లోకి ప్రవేశిస్తోందని ప్రకటించారు. అలాగే, గాజాలోని జరుగుతున్న యుద్ధం ఇజ్రాయెల్, హిజ్బుల్లా, వారి మిత్రదేశాల మధ్య పూర్తి స్థాయి యుద్ధానికి దారితీస్తుందనే ఆందోళనలు దాదాపు సంవత్సరం నుండి కనిపిస్తున్నాయి. అయితే, ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య కొంత కాలంగా సాధారణమైన క్షిపణి దాడుల కాస్తా తాజా ఇజ్రాయెలీ దాడులతో ఇరాన్‌తో పాటు ఇస్లామిక్ దేశాలను కూడా ఉడికిస్తున్నాయి. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న పరిస్థితులపై గల్ఫ్ దేశాలు ఇప్పటి వరకూ కాస్త మౌనంగానే ఉన్నాయి. దీనికి భిన్నంగా అవి కూడా రంగంలోకి దిగితే ఆ రచ్చ ప్రపంచవ్యాప్తమవుతుందని అనడంలో సందేహమే లేదు.అయితే, ఇప్పుడు హిజ్బుల్లా తీసుకునే నిర్ణయంపైనే కొన్ని రోజుల్లో ఏం జరుగుతుందా అనేది ఆధారపడి ఉంది. ఇజ్రాయెల్ దాడిపై హిజ్బుల్లా తీవ్రంగా ప్రతిస్పందించగలదా లేదా అనేది వేచి చూడాలి. ఇంకో వైపు నుండి ఇజ్రాయెల్ లెబనాన్‌పై భూ దండయాత్రను ప్రారంభించడానికి సిద్ధంగా ఉందా అనేది తేలాలి. ఈ రెండిటిలో ఏది జరిగినా అది మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలను మరో స్థాయికి తీసుకెళ్తాయి. ఇది వినాశకరమైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఇదే జరిగితే, ప్రపంచ పెద్దన్న అమెరికా ఇజ్రాయెల్‌ను కంట్రోల్ చేస్తుందా లేదా అనే దానిపై ప్రపంచ యుద్ధం ఆధారపడి ఉంటుంది.ఇజ్రాయెల్ ప్రస్తుత చర్యలు చూస్తుంటే, లెబనాన్‌ను నాశనం చేయడానికే సిద్ధపడినట్లు కనిపిస్తుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్, హిజ్బుల్లా సంఘర్షణల మధ్య ఇప్పటికే లెబనాన్‌లో దాదాపు 3 కోట్ల మంది ప్రభావితమయ్యారు. 2000, 2006లో జరిగిన ఘర్షణల వల్ల ఇప్పటికీ లెబనాన్ కోలుకోలేకపోయింది. అక్కడ పార్లమెంట్‌లో హిజ్బుల్లా ప్రాభల్యం పెరగడం, ప్రభుత్వం పడిపోవడం,

# కల్తీ చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసారు

విజయవాడ,తిరుమల లడ్డూని కల్తీ చేసి వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వేంకటేశ్వరస్వామి భక్తులు, ఏపీ ప్రజలు ఆయణ్ని క్షమించరని అన్నారు. లడ్డూ కల్తీ చేసి అపరాచానికి పాల్పడిన ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. 'జగన్ హయాంలో లడ్డూ తయారీ నాణ్యతలో వైసీపీ నేతలు రాజీపడ్డారు. కమిషన్లకు కక్కుర్తి పడి నేతి సరఫరాలో నిర్లక్ష్యం వహించారు. పవిత్రమైన ప్రసాదంలో కొవ్వు కలిపి అపవిత్రం చేశారు. కల్తీ జరిగిందని ల్యాబ్ రిపోర్టుల ద్వారా నిర్ధారణ అయ్యింది. కోట్లాది మంది భక్తుల మనోభావాలను జగన్ దెబ్బతీశారు. టీటీడీ ఆస్తులు వేలం వేసేందుకు యత్నించారు. శ్రీవారి నిధులు దారి మళ్లించేందుకు కుట్రలు చేశారు. వాటి కన్నా ఇప్పుడు చేసిన నేరం అమానుషం. ఈ అపచారం చేసిన వ్యక్తులందరినీ కఠినంగా శిక్షించాలి.టీటీడీ బోర్డులో బీజేపీ నేతలు ఉన్నారని నింద మా పార్టీ నేతలకు ఆపాదించాలని జగన్ చూస్తున్నారు. టీటీడీ వ్యవహారాల్లో జగన్, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి తప్ప సభ్యులందరూ డమ్మీలే కదా. ఆ ముగ్గురూ నిర్ణయాలు తీసుకుని బోర్డు మీటింగ్‌ల పేరుతో ఆమోదించేవారు. జగన్ తాను చేసిన తప్పుల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ నేతల పాత్ర ఉందని చెబుతున్నారు. సీఎంగా ఉండి టీటీడీలో జరిగే అపచారాలను ఆపే బాధ్యత నీకు లేదా జగన్?. ఏపీ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి సిగ్గు లేకుండా వాగుతున్నారు. లడ్డూ ప్రసాదాన్ని పంది కొవ్వుతో పోలుస్తున్నాడు. అసలు ఏమైనా బుద్ధి ఉందా?. వైసీపీ అధినేతకు టామాటా, పొటాటోకు కూడా తేడా తెలియదన్నారు. ఫ్యాన్ పార్టీ అధినేత ఐదు నిమిషాలు మాట్లాడేతే చాలు అతని డొల్లతనం బయటపడుతుంది. లడ్డూ కల్తీ పాపంలో ఎంతమందికి భాగస్వామ్యం ఉన్నా శిక్షించాల్సిందే. ఇప్పటికే సిట్ అధికారులు విచారణ ప్రారంభించారు. చివరకు సిట్ అధికారులూ సరైన వారు కాదంటూ మాజీ సీఎం జగన్ సర్టిఫికేట్ ఇవ్వడం హాస్యాస్పదం. నెయ్యి కాంట్రాక్టులో కమిషన్లు నొక్కి స్వామివారికి అపచారం చేశారు. కాబట్టి అందరూ తప్పకుండా విచారణ ఎదుర్కొని శిక్షకు గురి కావాల్సిందేనని అన్నారు.

# బాబు పనితీరు అద్భుతం

శ్రీకాకుళం,విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సేవలు, తీసుకున్న చర్యలు అద్భుతంగా పని చేశాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వరదలకు సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల వల్లే పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పిందన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా దీపావళి రోజు నుంచీ గ్యాస్ కనెక్షన్లు అందిస్తాం'అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అటు ప్రధాని మోదీ, ఇటు సీఎం చంద్రబాబు ఇద్దరూ కలిసి ఏపీని అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. ఇప్పటికే రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు, పోలవరం మొదటి దశ పనుల కోసం రూ.12,567కోట్లు కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్రానికి మూడు పారిశ్రామిక కారిడార్లు సహా ఇతర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మోదీ సర్కార్ అండగా ఉన్నట్లు రామ్మోహన్ నాయుడు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ..' శ్రీకాకుళం జిల్లా నుంచి నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చింది. ఈ ఐదేళ్లపాటు జిల్లా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. జిల్లాలో ఒక పోర్టు, ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తా. టెక్కలి మూలపేటలో సంవత్సరంలో పోర్టు పనులు పూర్తి చేస్తాం. నాకు కేంద్ర మంత్రిగా అవకాశం వస్తే.. బాబాయి కింజరాపు అచ్చెన్నాయుడుకి ఏపీ మంత్రిగా అవకాశం వచ్చింది. ఇద్దరం కలిసి జిల్లాని అభివృద్ధి చేస్తాం. శ్రీకాకుళం జిల్లా ప్రజల అభిమానం వల్లే మేము ఈ స్థాయికి వచ్చాం. ప్రతీ నెలా తెల్లవారుజామునే మీ ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. మాజీ సీఎం ఎన్టీఆర్ ఆనాడు మత్స్యకారులకు అనేక విధాలుగా సహాయం చేశారు. అదే విధంగా సీఎం చంద్రబాబు ముందుకు వచ్చారు. ప్రతీ ఒక్కరినీ ఆయన ఆదుకునేందుకు ముందుంటారు. త వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది. జగన్ హయాంలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా వేయలేదు. ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థులకు గత పాలకులు తీవ్రనష్టం చేకూర్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజే 16వేల పోస్టుల భర్తీ చేసేందుకు సీఎం చంద్రబాబు డిఎస్సీ నోటిఫికేషన్‌పై మొదటి సంతకం చేశారు. గత ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లు మూసి వేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక 100రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 178 అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. హుద్‌హుద్ తుపాన్ బాధితులకూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించామని అన్నారు.

ఎఆర్ డెయిరీ ఫుడ్ ప్రొడక్స్ట్పై చర్యలు తీసుకోండి

# కల్తీ నెయ్యి ఘటనపై పోలీసులుకు టిటిడి ఫిర్యాదు

తిరుమల,తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిన ఘటన సంచలనం కలిగించగా దానిపై టీటీడీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్‌లో ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రొడక్ట్ లిమిటెడ్‌పై చర్యలు తీసుకోవాలని టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. నిబంధనలు అతిక్రమించి కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపించారు. ఈ యేడాది మే 15న నెయ్యి సప్లైకి ఆర్డర్స్ ఇవ్వగా , జూన్ 12, 20, 25 తేదీలతో పాటు జులై 6, 12న 4 ట్యాంకర్ల నెయ్యి ఏఆర్ డెయిరీ సరఫరా చేసిందని వివరించారు. ఏఆర్ డెయిరీ సప్లై చేసిన నెయ్యిని ఎన్‌డీబీఎల్ సహకారంతో అడల్టేష్రన్ టెస్టింగ్ నిర్వహించామన్నారు. నెయ్యిలో వెజిటెబుల్ ఆయిల్, అనిమల్ ఫ్యాట్ కల్తీ జరిగినట్టు రిపోర్టు వచ్చిందన్నారు. జులై 22, 23, 27 తేదీల్లో ఏఆర్ డెయిరీకి షోకాజ్ నోటీసులు జారీ చేశామని టీటీడీ వెల్లడించింది. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని సెప్టెంబర్ 4న ఏఆర్ డెయిరీ సమాధానం ఇచ్చిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కల్తీకి పాల్పడిన ఏఆర్ డెయిరీపై చర్యలు తీసుకోవాలని బుధవారం టీటీడీ అధికారులు ఫిర్యాదు చేశారు.

## చెడు అలవాట్లు సులువుగా వెంటపడతాయి

తిరుమల,వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. ఎందుకంటే సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు

# టెండర్లను వెంటనే రద్దు చేయాల్సిందే

విశాఖపట్టణం,పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణకు ఇచ్చిన టెండర్స్ ను రద్దు చేయాలని హాస్పిటల్ వద్ద గురువారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టెండర్స్ ప్రతులను దగ్ధం చేశారు. సిఐటియు ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ పోర్టు ఏర్పడి 50సంవత్సరాల తరువాత వచ్చిన లాభాలతో పోర్టు గో÷-డలెన్ జూబ్లీ హాస్పిటల్ 150 పడకల సామర్ధ్యంతో సమర్ధవంతంగా పోర్టు డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్ అయిన కార్మికులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు, పూల్ కళాశీలకు, సిహెచ్డి క్యాజువల్ కార్మికులకు మరియు సిఐఎస్ఎఫ్ ఉద్యోగులు వారి వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 35వేల కుటుంబాలకు సేవలందిస్తున్నదని తెలిపారు. పోర్టు ఈ సంవత్సరం రూ.386 కోట్లు లాభం వచ్చిందని, అలాగే రూ.171 కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు కట్టామని చెప్పారు. రిజర్వ్ ఫండ్ కూడా ఉన్నాయి కాబట్టి పోర్టు సోంత నిధులతో అభివఅద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు వారి చేతుల్లోకి వెళితే తిరిగి పోర్టు చేతుల్లోకి వచ్చే అవకాశం లేదని.. అప్పుడు వైద్యం వేలాదిమంది పోర్టు డాక్, పెన్షనర్ల, పూల్, కాజువల్ కుటుంబాలకు దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మొదట్లో బ్రహ్మాండంగా ఉంటుందని భ్రమ పెడతారు.. అనంతరం ఇది ఒప్పందంలో లేదు, అది ఒప్పందంలో లేదు, ధరల పెరిగాయి, ఇది వర్తించదు అది వర్తించదు, మీరు డబ్బులు చెల్లిస్తే గాని కుదరదని ఖరాఖండిగా చెబుతారని ధ్వజమెత్తారు. తమపై అదనంగా మోయలేని భారం పడుతుందన్నారు. కరోనా మహమ్మారి కాలంలో ప్రయివేట్ ఆసుపత్రులు ఎంతలా దిగజారి ప్రజలను దోచుకున్నాయో అందరి కళ్ళ ముందు ఇంకా మెదలాడుతూనే ఉందని గుర్తు చేశారు. ఇదే జరిగితే భవిష్యత్తులో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. 90 ఏళ్ల విశాఖ పోర్టు చరిత్రలో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా రాత్రనకా, పగలనకా చెమటోడ్చి పోర్టును ఈ ఉన్నత స్థితికి, అంతర్జాతీయ స్థాయికి తీసుకువచ్చిన ఉద్యోగ, కార్మిక, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు వైద్య ఖర్చులు తగ్గించాలన్న నెపంతో ప్రైవేట్ వారికి కట్టబెడతామన్న దుర్మార్గపు ఆలోచన విరమించుకోవాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులు పొందే వైద్యాన్ని లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గమన్నారు. 'మెరుగైన వైద్యం అందించడం యాజమాన్యం బాధ్యత-పొందడం ఉద్యోగ, కార్మికుల హక్కు'. పోర్టుల హాస్పిటల్స్ విషయమై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని ఫెడరేషన్ల అభిప్రాయాలు తీసుకునే ముందుకు వెళతామని గతంలో హామీ ఇచ్చిన ఐపీఎ మాట తప్పిందని ఆరోపించారు. పోర్టులోనున్న కార్మిక సంఘాలన్నీ ఏకపక్షంగా పోర్టు హాస్పటల్ ను ప్రైవేటీకరించొద్దని స్పష్టంగా చెప్పాయన్నారు. ఏపీ హైకోర్టు కూడా హాస్పిటల్ విషయమై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పిందని గుర్తు చేశారు. కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా గో÷-డలెన్ జూబ్లీ హాస్పటల్ ప్రైవేటుకు ఇవ్వడానికి యాజమాన్యం ప్రభుత్వం ముందుకెళ్లడం చూస్తే ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని అత్యంత మల్టీ-సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివఅద్ధి చేయాలని, స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ లను, స్పెషలైజ్డ్ స్టాఫ్ ను, నాణ్యమైన మందులను పోర్టు సొంత నిధులతోనే అభివఅద్ధి చేసే చర్యలను చేపట్టాలని సిఐటియు కోరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పోర్ట్ డాక్ లో ఎం.ఎ÷-లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యానారయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి రామలింగేశ్వర రావు, త్రీనాధ్,వి డి ఎల్ బి డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కన్న, సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం,రాయదుర్గం నియోజకవర్గంలో బిసి హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితమ్మ కు వినతి పత్రం ఇచ్చారు. మంత్రి గురువారం రాయదుర్గం పర్యటించిన సందర్భంగా మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. మంత్రి వెంట మాజీమంత్రి, ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు కూడా ఉన్నారు. బీ సీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, సొంత భవనాలను ఏర్పాటు చేయాలనీ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా 8 బీసీ హాస్టల్స్ ఉండగా 6 హాస్టల్ లకు సొంతభవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న మెస్ ఛార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని కోరారు. శిథిలావస్థలో గల ప్రభుత్వ హాస్టల్ లకు సొంత భవనాలు కేటాయించి,వాటి మరమ్మత్తుల కోసం నిధులు విడుదల చేయాలన్నారు. గుమ్మగట్ట మండలం గోనబావి గ్రామంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన బిసి మహిళా గురుకుల పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు 2500 పెంచాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలంలో ఉన్న బిసి గురుకుల పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. హాస్టల్ సమస్యల పరిష్కారానికి కఋషి చేస్తామని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షులు శశికుమార్, కోశాధికారి దినకర్, ఉపా అధ్యక్షులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళాలోకానికి స్ఫూర్తి

రాజన్న సిరిసిల్ల,తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళి అర్పించారు. ఐలమ్మ జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు.వీరనారి చాకలి ఐలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తికి ప్రతీక. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికి ఆదర్శం అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో నిత్య స్మరణీయురాలు ఐలమ్మ. బహుజనులు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వామ్యం కావటానికి ఆమెనే స్ఫూర్తి. ఉద్యమ పోరాటాల్లో మహిళల పాత్ర అసమానమైనది అని చాటి చెప్పిన యోధురాలు ఐలమ్మ. ఇవ్వాళ ఆమె జయంతి సందర్భంగా ఆ మహనీయురాలిని స్మరించుకోవటం గొప్ప అవకాశం అని కేటీఆర్ పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ఆకాంక్షలకు అనుగుణంగానే బీఆర్ఎస్ పాలన సాగింది. బడుగులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తూ ఐలమ్మను ఘనంగా స్మరించుకున్నాం. చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఏర్పడ్డాక.. కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఐలమ్మ జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చారు. పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టారు. చిట్యాల ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఐలమ్మ ఆకాంక్షలను నిత్యం ముందుకు తీసుకెళ్లటంలో బీఆర్ఎస్ ముందుంటుంది.

# మోదీ సీటే కేజ్రీవాల్ లక్ష్యం!

న్యూఢిల్లీ,ఏ రాజకీయ నాయకుడికైనా ఆయన పార్టీ అనుసరించే సిద్ధాంతాన్నే బట్టే గుర్తింపు లభిస్తుంది. అయితే, తామే ఒక సిద్ధాంతమని, తమకు వేరే సిద్ధాంతం అవసరం లేదని చెప్పుకునే నాయకులు కూడా రాజకీయ తెర మీద మధ్య మధ్య ప్రత్యక్షమవుతుంటారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ రెండో కోవకు చెందిన వ్యక్తి. ఆయనకు ఒక సిద్ధాంతమంటూ ఏమీ లేదు. ఆయనే ఓ సిద్ధాంతం. ఆయన ఏం చేసినా ఇతరులతో సంప్రదించడమంటూ ఉండదు. ఆ విధానమే ఆయనను మద్యం కేసులో ఇరికించి, తీహార్ జైలుకు పంపించింది. జైలు నుంచి బయటికి వచ్చినా, మళ్లీ రాజకీయంగా పావులు కదుపుతున్నా ప్రతిదీ సొంత నిర్ణయమే. తన మనసుకు ఎంత తోస్తే అంత. తీహార్ జైలు నుంచి బెయిలు మీద బయటికి రాగానే ఆయన తనకు అత్యంత సన్నిహితురాలు, మంత్రివర్గ సభ్యురాలు అయిన ఆతిశీ మార్లేనాను ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన లక్ష్యం బీజేపీ, ప్రధాని, కాంగ్రెస్. ఈ మూడు శక్తులను తాను వదిలిపెట్టేది లేదని ఆయన ఢంకా బజాయించి చెబుతున్నారు. నిజానికి ఓట్లను కూడగట్టడంలో బీజేపీలో నరేంద్ర మోదీ ఎంతో ఆమ్ ఆద్మీ పార్టీలో కేజ్రీవాల్ అంత. ఈ విషయంలో ఇద్దరూ సమఉజ్జీలు. ఇప్పుడు ఆయనకు మోదీ సీటే ప్రధాన లక్ష్యం.అన్నా హజారేను కలుసుకుని, ఆయనతో కలిసి అవినీతి మీద పోరాటం సాగిస్తున్న నాటి నుంచి కేజ్రీవాల్ రాజకీయంగా తన్ను తాను గుర్తించడం మొదలైంది. తాను కేంద్ర బిందువుగా ఉండాలే తప్ప గుంపులో గోవిందా అన్నట్టుగా ఉండకూడదనే అభిప్రాయం ఆయనకు అప్పుడు కలిగింది. తాను ప్రజల కోసమే పుట్టాననే అభిప్రాయాన్ని ఆయన కలిగించగలిగారు. తాను నీతి నిజాయతీలకు కట్టుబడి ఉండే వ్యక్తినని నిరూపించుకోగలిగారు. ఆధునిక స్వాతంత్ర్య సమర యోధుడిననే గుర్తింపును పొందగలిగారు. ఈ మిశ్రమానికి రాజకీయ, సామాజిక, చారిత్రక మసాలా కలిపి అందమైన, ఆకర్షణీయమైన, రుచికరమైన వంటకాన్ని తయారు చేశారు. దీనితో పాటు ఇందిరా గాంధీ మాదిరిగానే సంక్షేమమే నినాదంగా ప్రజల్లోకి ఆయన చొచ్చుకుపోయారు.

నిశ్శబ్ద వ్యూహాలు

ఢిల్లీని లక్షలాది కోట్ల రూపాయల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తానని ఆయన ఏనాడూ ప్రకటించ లేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి కానీ, ఆధునిక టెక్నాలజీ గురించి కానీ ఆయన ఎక్కడా ఎప్పుడూ మాట్లాడలేదు. "మీతో కలిసిపోయే నాయకుడిని, మీతో తినే, తాగే, పడుకునే నాయకుడిని ఎంచుకోండి. మీలాగా దుస్తులు ధరించే నాయకుడిని అనుసరించండి" అనేది ఆయన సరళ సిద్ధాంతం. 2014లో మోదీ ప్రభంజనం ప్రారంభమైన తర్వాత ఆయనకు భిన్నమైన నాయకుల అవసరం ఏర్పడిన విషయాన్ని గ్రహించుకుని ఆయన కొత్త అవతారం ఎత్తారు.కులాలు, మతాలతో ఆయనకు పని లేదు. తానే ఒక సిద్ధాంతంగా మారడమే కాక, తన అనుచరులు, అనుయాయులను కూడా ఇదే సిద్ధాంతంలోకి మార్చారు. ఇదే సిద్ధాంతంతో ఆయన మూడు పర్యాయాలు ఢిల్లీ శాసనసభలోనూ, ఒకసారి పంజాబ్ శాసనసభలోనూ విజయ ఢంకా మోగించారు. క్రమంగా కేజ్రీవాలిజం అనే కొత్త సిద్ధాంతం రూపుదిద్దుకుంది. ఇది గాంధీయిజం, మార్క్సిజం, క్యాపిటలిజం, సోషలిజం వగైరాలన్నిటికీ అతీతమైంది. పని చేసే ప్రభుత్వం, సమర్థవంతమైన పాలన అనే విధానాలను అనుసరించిన కేజ్రీవాల్ వీటితోనే విజయాలు సాధిస్తున్నారు.ఉచిత విద్య, ఉచిత విద్యుత్తు, చౌకగా వైద్యం, ఉచిత మంచినీరు ఆయన విధానాల్లో ముఖ్యమైన భాగాలు. విచిత్రమేమిటంటే, ఆయన ప్రవేశపెట్టిన ఉచితాలన్నీ కాలక్రమంలో దేశంలో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోల్లో ప్రధానాంశాలుగా మారిపోయాయి. ఇక మతం విషయానికి వస్తే ఆయన కరుడు కట్టిన హిందువు. వీలైనప్పుడల్లా ఆంజనేయ స్వామి ఆలయాలకు వెడుతుంటారు. తాను లౌకికవాద హిందువునని చెప్పుకుంటుంటారు. ఢిల్లీలోని బస్తీల్లో, మురికివాడల్లో, మైనారిటీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ వాలంటీర్లు అహర్నిశలూ కనిపిస్తుంటారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలెవరూ బీజేపీని గానీ, కాంగ్రెస్ పార్టీని గానీ ఒక పట్టాన నమ్మరు. ఈ రెండు పార్టీలు తమను అనేక విధాలుగా మోసం చేశాయని వారు చెబుతుంటారు. మురికివాడల్లో, పేదల ప్రాంతాల్లో విద్యుత్తు, మంచినీరు, ఇతర ప్రాథమిక సదుపాయాలు అవిచ్ఛిన్నంగా




కొనసాగడం మీద వీరు దృష్టి పెడుతుంటారు. పైగా ఈ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తల్లో 80 శాతం మంది యువజనులే. పార్టీ ఏర్పడిన మొదట్లో విదేశాల నుంచే సహాయ సహకారాలు అందుతుండేవి. ఇప్పుడు పార్టీ పూర్తిగా నిలదొక్కుతుంది.

అధికార దాహం

కొద్ది కాలం జైలు జీవితాన్ని అనుభవించిన తర్వాత కేజ్రీవాల్‌లో బాగా మార్పు వచ్చింది. ఇక ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆయన ఢిల్లీకి, శాసనసభ ఎన్నికలకు పరిమితం కాదలుచుకోలేదు. జాతీయస్థాయి, లోక్ సభ వంటివి ఆయన ప్రాధాన్యాల జాబితాలో మొదటి స్థానానికి చేరిపోయాయి. సుమారు 12 ఏళ్లుగా ఆయన జాతీయ రాజకీయాల మీద దృష్టి పెట్టినప్పటికీ, జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత మాత్రం ఆయన సంకల్పం మరింత దృఢపడిపోయింది. 2014-19 సంవత్సరాల మధ్య మోదీని ఆయన తన ఏకైక లక్ష్యంగా చేసుకున్నారు. మోదీని అనేక సందర్భాల్లో ఆయన ఓ ఉన్మాదిగా అభివర్ణించడం కూడా జరిగింది. ఢిల్లీ శాసనసభలో 70 స్థానాలకు 67 స్థానాలు గెలుచుకున్న తర్వాత ఆయనకు జాతీయ రాజకీయాల మీద మరింతగా దృష్టి కేంద్రీకృతమైంది. ముందుగా ఇతర రాష్ట్రాల్లో బలం పుంజుకునే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. గత పదేళ్ల కాలంలో ఆయన హర్యానా, కర్ణాటక, చత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, ఉత్తరాఖండ్ ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో ఆయన పార్టీ పోటీ చేసింది. అయితే, ఈ రాష్ట్రాల్లో ఆయన ఇంకా ఖాతా ప్రారంభించలేదు. అయితే, ఆయనకు ఇతర రాష్ట్రాల్లో తనకున్న బలం ఏమిటో మాత్రం తెలిసి వచ్చింది.

దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా ఆమ్ ఆద్మీపార్టీ రెండు రాష్ట్రాల్లో, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అంటే మూడవ స్థానంలో ఉందన్నమాట. ఇటీవల జాతీయ స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగినప్పుడు కూడా దేశంలో అత్యంత జనాకర్షణ కలిగిన నాయకుల్లో మోదీ, రాహుల్ గాంధీ తర్వాత కేజ్రీవాల్ మూడవ స్థానంలో ఉన్నట్టు తేలింది. కేజ్రీవాల్‌కు జనాదరణ పెరగడానికి కారణమేమిటన్నది అర్థం కావడం లేదు. ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "మేము సాధారణ ప్రజలం. సమస్యలకు పరిష్కారం వామపక్షాల్లో దొరుకుతుంద నుకుంటే వాటిని అక్కడి నుంచే స్వీకరిస్తాం. పరిష్కారం మితవాదుల్లో దొరుకుతుందనుకుంటే వాటిని అక్కడి నుంచే తీసుకుంటాం. అకుంఠిత దేశభక్తి, తిరుగులేని నిజాయతీ, మానవత్వం ఇవే మా సిద్ధాంతాలు" అని వివరించారు.ఉన్నత స్థానానికి వెళ్లే దారి అనేక ఆటంకాలు, అవరోధాలతో కూడుకున్నదని ఆయనకు బాగా తెలుసు. ఇండీ కూటమి వాహనాన్ని కూడా తోడు తీసుకుని ఈ జాతీయ రహదారిలో ముందుకు సాగాలని, అవసరమైనప్పుడు డ్రైవర్ సీటులో కూర్చోవచ్చని ఆయన ఆలోచించారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ లేకపోవడం వల్ల ఏర్పడిన శూన్యాన్ని ఆయన భర్తీ చేశారు. ఆ విధంగా ఆయన కాంగ్రెస్ పార్టీకి ఒక ముప్పుగా మారారు. ఆయన చాతుర్యాన్ని, ఆయన వ్యూహాల్ని, ఆయన ఆశల్ని, ఆశయాల్ని అర్థం చేసుకున్న ప్రాంతీయ పార్టీలు కూడా ఆయన వల్ల తమకు ముప్పు ఉందని గ్రహించాయి. అయితే, ఆయన ఏ విషయంలోనూ హడావిడి పడరు. తొందరపాటు వైఖరి కనిపించదు. నిదానమే ప్రధామన్నట్టుగా ఆయన రాజకీయాల్ని ముందుకు నడిపిస్తున్నారు. ఆయన ఓటర్లు ఆయన నుంచి అత్యుత్తమ ప్రాథమిక సౌకర్యాలను కోరుకుంటుండగా ఆయన మోదీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని కోరుకుంటున్నారు. రాష్ట్ర పీఠం మీద ఆతిషీని ప్రతిష్ఠించిన తర్వాత జాతీయ పీఠం మీద శ్రద్ధ పెరగడం మరింత ఎక్కువవుతుంది.

# కిమిడి ఫ్యామిలీ వార్..




విజయనగరం: విజయనగరం జిల్లా చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణని ఓడించిన కిమిడి ఫ్యామిలీలో కోల్డ్ వార్ హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల ముందు వరకు అక్కడ టీడీపీ ఇన్చార్జ్‌గా ఉన్న కిమిడి నాగార్జున వర్సెస్ ఎమ్మెల్యే కిమిడ కళా వెంకట్రావు తనయుడు రామ్‌మల్లిక్‌ల ఆధిపత్యపోరు పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. మాజీ మంత్రి కళా వెంకట్రావు తన కోసం సీటు త్యాగం చేసిన సోదరుడి కొడుకు నాగార్జునను కాదని సొంత వారసుడ్ని ప్రమోట్ చేసుకుంటుడటం వివాదాస్పదంగా తయారైంది. కిమిడి వారుసులు ఇద్దరూ ఎవరి గేమ్ వారు ఆడుతుండటంతో.. వచ్చే ఎన్నికల నాటి అధిష్టానం ఆశీస్సులు ఎవరికి దక్కుతాయన్న చర్చ జరుగుతోంది.ఎన్నికల ముందు రసవత్తరంగా మారిన విజయనగరం జిల్లా చీపురుపల్లి పాలిటిక్స్ ఎన్నికల తరువాత కూడా అంతే ఇంట్రస్టింగ్‌గా కొనసాగుతున్నాయి. ఇంకా చెప్పాలంటే అంతకుమించి అన్నట్టు తయారయ్యాయి. అది కూడా ఒకే పార్టీ ఒకే ఫ్యామిలీలో పాలిటిక్స్ కావడం మరింత ఉత్కంఠ రేపుతోంది. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అయిన మాజీ మంత్రికిమిడి కళా వెంకటరావు అనుభవం సాక్షిగా ఆయన హయాంలో జరుగుతున్న రాజకీయం చీపురుపల్లి ని హాట్ హాట్‌గా మారుస్తున్నాయి. ఎక్కడా ఎలాంటి కత్తులు దూసుకోకపోయినా.. ఎలాంటి విమర్శలు చేసుకోకపోతున్నా.. టైమ్ బాంబ్ పేల్చుకోవడానికి రిమోట్ సెట్ చేసుకున్నారనే గుస గుసలు వినిపిస్తున్నాయి.కిమిడి కళా వెంకటరావు శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్లని వదిలి చీపురుపల్లిలో అడుగు పెట్టిన నాటి నుండి ఈ కోల్డ్ వార్ నడుస్తూనే ఉంది. ఎన్నికల సమయంలో కళా వెంకటరావుకి చీపురుపల్లి టిక్కెట్ అనౌన్స్ చేయగానే అప్పటి వరకు ఇన్చార్జ్‌గా ఉన్న కిమిడి నాగార్జున తన అసంతృప్తిని బహిరంగంగానే వెళ్ళగక్కారు. అటు అధిస్తానంపై ఇటు కళా వెంకటరావుపై పదునైన విమర్శలు చేశారు. ఇక రాజకీయ సన్యాసం బెటర్ అని నిర్వేదం ప్రకటించారు. యువత రాజకీయాల్లోకి రావద్దు , మోసపోవద్దని హితబోధ కూడా చేశారు. కొన్నాళ్ళు అజ్ఞాతంలోకి కూడా వెళ్లారు . తరువాత నారా లోకేష్ చొరవతో బయటకి వచ్చి పార్టీ కోసం పని చేశారు. చీపురుపల్లిలో పెదనాన్న కళా వెంకటరావు గెలుపుకోసం కష్టించి పని చేశారు. స్టార్ క్యాంపెనర్ గా శ్రీకాకుళం , ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రచారం నిర్వహించారు.సీన్ కట్ చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చీపురుపల్లిలో బొత్స సత్యానారాయణను ఓడించి కళా వెంకటరావు జయకేతనం ఎగురవేశారు. కళా గెలిచినా నియోజకవర్గంలో మంచి పట్టున్న నాగార్జున ఆధిపత్యం కొనసాగుతుందని అందరూ భావించారు. కానీ ఇక్కడే జాగ్రత్త పడ్డారు కళా వెంకటరావు.అప్పటివరకు రాజకీయాలకు పనికిరాడు అనే ముద్రఉన్న తన తనయుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడును తెరమీదకి తీసుకువచ్చారు. తాను రాజాంలో ఉంటూ తనయుడుకి నియోజకవర్గాన్ని అప్పగించారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు ఎం జరిగినా రామ్ మల్లిక్ నే చూసుకుంటున్నారు. తండ్రి సలహాలు సూచనలతో నాయకులను , కార్యకర్తలను కలుపుకుంటూ రాజకీయ ఓనమాలు దిద్దుతున్నాడు . సుమారు అయిదేళ్ళ నుండి నియోజకవర్గాన్ని నమ్ముకొని ఉన్న నాగార్జునను కళావెంకట్రాకు పూర్తిగా విస్మరిస్తున్నారంట. ఏనాడూ పిలిచిన పాపాన కూడా పోవడం లేదట.దాంతో నాగార్జున సీన్ రివర్స్ అయింది. 2019 ఎన్నికల్లో అదే చీపురుపల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయిన నాగార్జున ఈ పరిస్థితి అసలు ఊహించలేదంట.. పార్టీ అధికారంలోనికి వచ్చాక తనకు అవమానాలు జరుగుతున్నాయని ఫీల్ అవుతున్నారంట. అందుకే ఆయన పెదనాన్న కుటుంబంతో అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారట. తనకున్న కేడర్ ను కలుసుకుంటూ వారితోనే చర్చిస్తూ అక్కడికే పరిమితం అవుతున్నారు. అప్పుడపుడూ జిల్లా పార్టీ అధ్యక్షుని హోదాలో విజయనగరంలో ఉన్న అశోక్ బంగ్లా కి వచ్చి కార్యకర్తలకి అందుబాటులో ఉంటున్నారు . కానీ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా ఆయన కనిపించడం లేదు.విజయనగరంలో సైతం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మంత్రి కొండపల్లి మాత్రమే కనిపిస్తున్నారు . వారు కూడా నాగర్జునకు అంతగా వాల్యూ ఇవ్వడం లేదనే టాక్ నడుస్తోంది. నాగార్జున కూడా గతంలోలా ప్రెస్ మీటలు పెట్టి వైసీపీ పై విమర్శలు చేయడం లేదు. అయితే నాగార్జునకు మాత్రం పార్టీ అధిష్టానం వద్ద పలుకుబడి బాగానే ఉందంటున్నారు.. పార్టీకి లాయల్టీగా ఉంటారనే పాజిటివ్ ఇంప్రెషన్ ఉందంట. నారా లోకేష్ సపోర్ట్ ఉండడం, గతంలో బొత్సపై చేసిన విమర్శల దాడి కూడా నగార్జునకు కలిసి

# అప్రమత్తం అయిన తెలంగాణ

హైదరాబాద్, తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ నిర్ధారణ అయిన నేపథ్యంలో తెలంగాణ దేవాదాయ శాఖఅప్రమత్తం అయ్యింది. రాష్ట్రంలో పలు ప్రధాన ఆలయాల్లోని లడ్డూల నాణ్యతపై టెస్టులు చేపట్టింది. ప్రముఖ దేవాలయాల్లోని నెయ్యి, ఇతర పదార్థాల శాంపిల్స్‌ను అధికారులు ల్యాబ్‌కు పంపించారు. అన్ని టెంపుల్స్‌లో తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇకపై ప్రసాదాల తయారీకి విజయ నెయ్యి, పాలనే వాడాలని దేవాదాయశాఖ ఆదేశాలు జారీచేసింది. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. అన్ని ఆలయాల్లో తనిఖీలు చేపట్టాలని దేవాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. లడ్డూలు, పులిహోర తయారీలో వాడే నెయ్యి, యాలకుల పొడి, జీడిపప్పు, చక్కెర పాకం, బూందీ ఇతర ముడి సరుకుల నాణ్యతను పరిశీలించాలని అధికారులను తెలంగాణ దేవాదాయ శాఖ ఆదేశించింది.దేవాదాయ శాఖ ఆదేశాలతో ఈవోలు ఆలయాల్లో తనిఖీలు చేపట్టారు. నెయ్యి శాంపిల్స్‌ను హైదరాబాద్ లోని ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. కొన్ని ఆలయాల్లో ప్రత్యేకంగా టెస్టింగ్ కమిటీల ఆధ్వర్యంలో లడ్డూలను తయారుచేస్తున్నారు. వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, హనుమకొండ భద్రకాళి ప్రసాదాల్లో వినియోగిస్తున్న నెయ్యి, ఇతర పదార్థాలను పరీక్షల కోసం ఇప్పటికే హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు అధికారులు పంపించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రసాదంలో వినియోగిస్తున్న నెయ్యి శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని చర్లపల్లిలోని ల్యాబ్‌కు తరలించారు. యాదాద్రిలో పదేళ్లుగా మదర్?డెయిరీ నెయ్యి వాడకం జరుగుతోంది. నెలకు సుమారు 20 వేల నుంచి 25 వేల కిలోల నెయ్యిని వినియోగించడం జరుగుతుంది. భద్రాచలంలో ప్రసాదాల తయారీకి ప్రత్యేక కమిటీని నియమించారు. కాగా.. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఘటన ఎంతటి దుమారం రేపిందో అందరికీ తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూల తయారీలో జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. తిరుమలలో కల్తీ నెయ్యి వాడకం, తిరుమలలో అపచారాలు జరిగాయని, అధికార దుర్వినియోగం జరిగిందని తదితర ఆరోపణలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థను( సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సిట్ ప్రత్యేక అధికారిగా గుంటూరు ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠిని సర్కార్ నియమించింది. సిట్ కమిటీలో సభ్యులుగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో పాటు కొంతమంది పోలీస్ అధికారులకు చోటు కల్పించారు.

# మరో యోగి ...

విజయవాడ,యూపీలో ఒక యోగి ఉన్నారు. ఆయన పేరు అనూహ్యంగా 2017లో యూపీ సీఎం గా ప్రతిపాదిస్తే అంతా ఆశ్చర్యంగా చూశారు. ఆయన ఎవరు అని వాకబు చేసే వారు ఉన్నారు. ఆయన అప్పటికి బీజేపీ ఎంపీగా పలు మార్లు గెలిచి ఉన్నారు. ఫక్తు హిందుత్వ వాది అయిన యోగిని పంపిస్తే కమల వికాసం అతి పెద్ద రాష్ట్రంలో సజావుగా సాగుతుందని భావించిన బీజేపీ తన ప్లాన్ ని అలా అమలు చేసింది.దాంతో యోగి ఆదిత్యనాథ్ సీఎం అయ్యారు. ఆయనే తిరిగి 2022లో బీజేపీని గెలిపించారు. అలా వరసగా రెండు సార్లు యూపీలో పార్టీని గెలిపించి అప్పటికి మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన మ్యాజిక్ ని రిపీట్ చేశారు. ఈ రోజు యోగి ప్రభ ఎలా ఉంది అంటే రేపటి దేశానికి ఆయన కాబోయే ప్రధానిగా ఫోకస్ అవుతున్నారుఅయితే యోగి వీర హిందూత్వకు 2024 లోక్ సభ ఎన్నికల్లో పెద్దగా సీట్లు రాలేదు. బీజేపీకి యూపీలో వచ్చిన ఓట్ల విషయంలో తేడా లేదు కానీ ఎస్పీ కాంగ్రెస్ కాంబో మాత్రం బీజేపీని దెబ్బ కొట్టింది. అయితే బీజేపీ తన వంతు రిపేర్లు చేసుకుంటోంది. అయినా యూపీకి యోగీ కంటే వేరే బలమైన నేత లేరని ఈ రోజుకీ ఆ పార్టీ భావిస్తోంది.ఇక సౌతిండియాలో చూస్తే మరో యోగి బీజేపీకి మిత్రుడుగా దొరికారా అన్న చర్చ సాగుతోంది. ఉత్తరాదిన ఉన్నంతగా హిందూత్వ వేడి వాడి సౌత్ లో ఉండదు. కానీ ఇపుడు ఆ దిశగా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ప్రపంచ దేవుడు అయిన శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో ఎనలేని అపచారం జరిగింది అని భావిస్తూ జనసేన అధినేత ఏపీ ప్రభుత్వం లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.అంతే కాదు ఆయన దేవాలయాలకు వెళ్ళి ప్రక్షాణల కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నారు. సనాతన ధర్మం గురించి బీజేపీ వారి కంటే పెద్ద గొంతుకతో మాట్లాడుతున్నారు. కాషాయ వస్త్రాలతో దీక్షా దక్షునిగా జనంలోకి వస్తున్నారు. హిందూ మతం మీద జరుగుతున్న దాడులకు హిందువులు అంతా ఏకీకృతం అయి ఉద్యమించాలని పవన్ పిలుపు ఇస్తున్నారు.సనాతన ధర్మపరిరక్షణ విషయంలో తాను చనిపోయినా పరవాలేదు అని కూడా పవన్ అంటున్నారు. పవన్ లో ఇలా వీర హిందూత్వను చూస్తున్న బీజేపీ తమ కంటే పది ఆకులు ఎక్కువ చదివారనే భావిస్తున్నారు. బీజేపీకి సౌత్ లో ఎక్కడ ఈ స్థాయిలో గ్లామర్ కలిగిన నేత లేరు. పవన్ కి ఉన్న చరిష్మా ఆయనకు ఉన్న దూకుడుని హిందూత్వతో మిక్స్ చేస్తే తెలుగు రాష్ట్రాలతో పాటు సౌత్ ఇండియాలోనే రాజకీయ పంట పండించవచ్చు అని కొత్త ఆశలు కలుగుతున్నాయని అంటున్నారు.బీజేపీ ఎప్పటికి అయినా ఏపీలో అధికారం చేపట్టాలని చూస్తోంది. అది తమ ఒక్కరి వల్ల కాదని కూడా ఆ పార్టీకి తెలుసు. పవన్ వంటి మిత్రుడిని తమ పక్కన ఉంచుకున్నది కూడా అందుకే. బీజేపీ జనసేన ఎప్పటికి అయినా ఒక్కటిగా ఉంటాయని కూడా రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి.ఏపీలో బలమైన రాజకీయ భూమిక పోషించడానికి బీజేపీ జనసేన కూడా సమయం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇపుడు పవన్ హిందూత్వ నినాదం కూడా రేపటి రోజున ఇద్దరు మిత్రులకు పనికి వచ్చేదిగా ఉంటుందని అంటున్నారు. అలా పవన్ రూపంలో దక్షిణాదిన మరో యోగి దొరికారు అని కమలం పార్టీతో పాటు ఆరెస్సెస్ కూడా సంతోషించే సందర్భం ఇదే అని అంటున్నారు.మరో వైపు జనసేనకు పవన్ కి ముఖ్యమంత్రి పీఠం మీద ఆశలు ఉండనే ఉన్నాయి. అయితే అది ఈ రోజుకు సాకారం కాకపోయినా ఫ్యూచర్ కి బాటలు వేసుకునేందుకు కూడా ఆ పార్టీ తనదైన కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. దాని కోసం ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. అధికారంలో ఉన్నా వీధులలోకి వచ్చి విపక్ష పాత్ర పోషించడం ద్వారా పవన్ కొత్త రాజకీయ పోకడలను పోతున్నారు.మరి ఏపీలో కానీ తెలుగు రాష్ట్రాలలో కానీ ఇంకా చెప్పాలీ అంటే సౌత్ లో కానీ హిందూత్వకు ఉన్న మద్దతు ఎంత ఆదరణ ఎంత అనేది కూడా చూడాల్సి ఉంది. దక్షిణాదిన మొదటి నుంచి వైవిధ్యభరితమైన రాజకీయం సాగుతుంది. ఇక్కడ భక్తులు ఉంటారు కానీ సెంటిమెంట్లు మరీ పీక్స్ లో ఉండవు.అలాగే ఎంతటి వారు అయినా తమ పరిధిని ఎరిగి ఆలోచనలు చేస్తారు. అందుకే బీజేపీ దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు అయితే సౌత్ ఇండియాలో పండడం లేదు. మరి పవన్ కళ్యాణ్ అంటే సౌత్ ఇండియా లెవెల్ లో అందరినీ ఆకర్షించగల నాయకుడు. ఆయనలో మరో యోగిని బీజేపీ చూస్తే కనుక రాజకీయ పరిణామాలు ఎలా మారతాయో వేచి చూడాల్సిందే.

# రాజకీయ భవిష్యత్‌పై తీవ్ర ఆందోళనలో కాంగ్రెస్ సీనియర్ నేత?



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్‌లో ఆయన మోస్ట్ సీనియర్ లీడర్. పార్టీలో అత్యంత పలుకుబడిన కలిగిన నేత. MLA, MLCగా పని చేసిన ఆ సీనియర్ లీడర్ పొలిటికల్ జర్నీ ఇప్పుడు అయోమయంలో పడిందా? అన్న అనుమానం మొదలైంది..? పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇబ్బందికరంగా మారాయట..? అందుకే పార్టీ కీలక సమావేశానికి సైతం ఆయన దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు ఇంతకీ హస్తానికి దూరంగా దూరంగా ఉంటున్న ఆ నేత ఎవరు? ఆయన ఫ్యూచర్ ఎలా ఉండబోతోందో?

ఆ ఇష్యూతో బాగా కలత చెందారట..

తెలంగాణ కాంగ్రెస్‌లో మోస్ట్ సీనియర్ లీడర్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి. సుదీర్ఘ కాలం మంత్రి పదవితోపాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలను శాసించిన జీవన్‌రెడ్డి.. పొలిటికల్ ఫ్యూచర్‌పై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో చాలా కీలకంగా ఉంటూ.. పార్టీ గొంతును గట్టిగా వినిపించిన జీవన్‌రెడ్డి వాయిస్ ఇప్పుడు ఎక్కడా వినిపించడం లేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచి సత్తా చాటిన జీవన్‌రెడ్డికి.. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. పార్టీలో పరిణామాలు మింగుడుపడని విధంగా తయారయ్యారంటున్నారు. దీంతో ప్రస్తుతం సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా తాజాగా చోటు చేసుకున్న ఓ ఇష్యూతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి బాగా కలత చెందారని వినికిడి. గాంధీభవన్ వేదికగా కొత్త పీసీసీ చీఫ్ నిర్వహించిన సమీక్షా సమావేశాలే ఆయన అసంతృప్తికి కారణమనే టాక్ వినిపిస్తోంది.

ఆహ్వానితుల జాబితాలో పేరు లేకపోవడంతో మనస్థాపం..

పీసీసీ సారథిగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకున్నాక.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం నిర్వహించగా, సీనియర్ నేత జీవన్ రెడ్డికి అవమానం జరిగినట్లు పార్టీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. సమావేశం కోసం సిద్ధం చేసిన ఆహ్వానితుల జాబితాలో జీవన్ రెడ్డి పేరు చేర్చకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అందరి పేర్లను ముద్రించి.. జీవన్‌రెడ్డిని విస్మరించడంతో ఆయన తీవ్రంగా కలత చెందారని చెబుతున్నారు. ఎట్ ది సేమ్ టైమ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేరు ఉండటం కూడా జీవన్‌రెడ్డిని అసంతృప్తికి గురి చేసిందని చెబుతున్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై.. పీసీసీ చీఫ్ సమక్షంలోనే తన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు.

సీనియర్లను విస్మరిస్తున్నారని నిర్వేదం..

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల నియోజకవర్గం నుంచి తన ప్రత్యర్థిగా పోటీ చేసిన వ్యక్తికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యమివ్వడాన్ని పెద్దాయన జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. ఈ విషయమై తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నారు. పార్టీలో కొత్త సాంప్రదాయం తెస్తున్నారని, సీనియర్లను విస్మరిస్తున్నారని జీవన్‌రెడ్డి నిర్వేదం వ్యక్తం చేస్తున్నారంటున్నారు. వలస ఎమ్మెల్యేల విషయంలో పార్టీ తీసుకునే నిర్ణయం పట్ల అసంతృప్తిగా ఉన్నారంటున్నారు.

పార్టీలో చేర్చుకోలేదు అంటూనే సమావేశాలకు ఆహ్వానించడంపై ఆగ్రహం..

బీఆర్ఎస్ నుంచి ఏ ఒక్కరిని చేర్చుకోలేదని బయటకు చెబుతూ.. పార్టీ సమావేశాలకు ఎలా ఆహ్వానిస్తున్నారని ప్రశ్నిస్తున్నారట జీవన్‌రెడ్డి. పార్టీ సమావేశాల్లో తన పేరు ప్రస్తావించకపోవడం కాకతాళీయమని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జ్ దీపాదాస్ మున్షి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. జీవన్ రెడ్డి మాత్రం.. వారి వాదనతో ఏకీభవించనట్లు చెబుతున్నారు. కావాలనే తనను నిర్లక్ష్యం చేస్తున్నారని అనుమానిస్తున్నారట పెద్దాయన. అందుకే పార్టీ సమావేశాలకు వెళ్లకూడదని నిర్ణయించుకోవడంతోపాటు.. ఈ మధ్య జరిగిన సీఎల్పీ భేటీకి గైర్హాజరైనట్లు ప్రచారం జరుగుతోంది.

క్యాడర్‌కు ఎలా న్యాయం చేయాలో అనే మదనం..

మరోవైపు తన సొంత నియోజకవర్గం జగిత్యాలలో కూడా మెల్లిమెల్లిగా ఎమ్మెల్యే సంజయ్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని ఆందోళన చెందుతున్నారు జీవన్‌రెడ్డి. ఇదే సమయంలో నిన్నమొన్నటి వరకు తన వెంట తిరిగిన వారిని దూరం చేసేలా ఎమ్మెల్యే సంజయ్ వ్యవహరిస్తుండటం పెద్దాయనను కలవర పెడుతుందని చెబుతున్నారు. నియోజకవర్గంలోని మార్కెట్ కమిటీ చైర్మన్లతో మొదలు కొని ఇతరత్రా నామినేటెడ్ పదవుల భర్తీలో ఎమ్మెల్యే సిఫార్సులకే ప్రాధాన్యమిస్తుండటం జీవన్‌రెడ్డికి ఆగ్రహం తెప్పిస్తుందని చెబుతున్నారు. రోజురోజుకు పార్టీలో అవమానాలు ఎక్కువ అవుతుండటం.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో తనను నమ్ముకున్న క్యాడర్‌కు ఎలా న్యాయం చేయాలనే అంశమై జీవన్ రెడ్డి మదన పడుతున్నారని చెబుతున్నారు.

పదవీ కాలం ముగిసిన తర్వాత మరింత ఇబ్బందిపడే అవకాశం..

ఇప్పుడు మార్కెట్ కమిటీ చైర్మన్ల విషయంలో జరుగుతున్నట్లే.. స్థానిక ఎన్నికల్లో జరిగితే పరిస్థితి తనను నమ్ముకున్న వారికి అన్యాయం జరుగుతుందని.. అదే సమయంలో వచ్చే మార్చిలో తన ఎమ్మెల్సీ పదవీ కాలం ముగిసిన తర్వాత మరింత ఇబ్బందిపడే అవకాశం ఉందన్న ఆలోచనతో భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నట్లు చెబుతున్నారు.మళ్లీ ఎమ్మెల్సీగా పోటీ చేయాలనే ఆలోచన లేని జీవన్‌రెడ్డి.. పార్టీని తన దారికి తెచ్చుకోవడం ఎలా అనే అంశంపై ఫోకస్ చేశారంటున్నారు. ఇదే సమయంలో జీవన్‌రెడ్డి పొలిటికల్ ఫ్యూచర్‌పై ఆయన వర్గంలోనే కలవరం కనిపిస్తోందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ముమ్ముందు జీవన్‌రెడ్డి అడుగులు ఆసక్తికరంగా మారాయి. నికార్సైన కాంగ్రెస్ వాదిగా ముద్రపడిన జీవన్‌రెడ్డి%% అధిష్టానం దృష్టిని ఆకర్షించేందుకు ఎలాంటి ఎత్తుగడ వేస్తారనేదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# బీఆర్ఎస్‌లో కొత్త 'పంచాయితీ'




హైదరాబాద్,ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో ఐక్యతారాగం లోపించి.. పార్టీపైనే అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది.గత దశాబ్ద కాలం పాటు బీఆర్ఎస్ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే బీఆర్ఎస్ అన్నట్లుగా పరిస్థితి ఉండేది. ఆయన చెప్పిందే వేదం.. ఆయన చేసిందే చట్టం అన్నట్లుగా కొనసాగింది. కానీ.. ఎప్పుడైతే ఆ పార్టీ అధికారాన్ని కోల్పోయిందో అప్పటి నుంచి సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో ఐక్యతారాగం లోపించి.. పార్టీపైనే అసంతృప్తి వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది.గత టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌ను, ఆ పార్టీని అభిమానులు అక్కున చేర్చుకున్నారు. ఉద్యమ నేతగా కేసీఆర్ ఏ పిలుపునిచ్చినా కార్యకర్తలు, అభిమానులు దానిని సక్సెస్ చేశారు. ఉద్యమకాలం నుంచి పార్టీకి అండదండగా నిలిచారు. ఆది నుంచి పార్టీలో కేసీఆర్ చెప్పిందే నడిచింది. ఆయన చెప్పినట్లే నేతల నుంచి కింది స్థాయి నాయకుల వరకూ పాటించారు. ఏనాడూ కూడా, ఎక్కడా కూడా పార్టీలో అసంతృప్తి కనిపించిన దాఖలాలు లేవు.ఆ ఊపులోనే టీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన నేతలు ప్రత్యేక రాష్ట్రం కోసం రాజీనామాలు చేసినా.. మరోసారి అక్కున చేర్చుకున్నారు. ఎన్నిసార్లు ఎన్నికల్లో అన్ని సార్లు ఓటు వేసి గెలిపించుకున్నారు. ఒక్క అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు.. స్థానిక సంస్థల వరకు కూడా ఎక్కడ చూసినా గులాబీ జెండాలు దర్శనమిచ్చాయి. ఉద్యమ సమయంలో ఉద్యమాన్ని ఉవ్వెత్తున తీసుకెళ్లడంలోనూ కేసీఆర్ ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకు సాగారు. చివరకు ఎలాగోలా రాష్ట్రం అయితే సిద్ధించింది.రాష్ట్రం ఏర్పాటు తరువాత వచ్చిన ఎన్నికల్లోనూ కేసీఆర్‌ను బంపర్ మెజార్టీతో గెలిపించి.. ఆయనకే ముఖ్యమంత్రి హోదా దక్కేలా కార్యకర్తలు కానీ, నాయకులు కానీ కష్టపడ్డారు. అయితే.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినప్పటికీ అటు పార్టీని, ఇటు ప్రభుత్వాన్ని రెండు కళ్లు అన్నట్లుగా ముందుకు నడిపించారు. ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తూనే ఏనాడూ పార్టీని ఆయన నిర్లక్ష్యం చేయలేదు. పార్టీ ఊపును మాత్రం అలాగే కొనసాగించారు. అలా.. కార్యకర్తలు, నాయకులు కూడా పార్టీని భుజాన వేసుకొని రెండుసార్లు అధికారంలోకి తీసుకొచ్చారు.అయితే.. పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ నేతల్లో ఓ ప్రచారం ఉంది. ఆ పదేళ్లు కింది స్థాయి కార్యకర్తలను, నాయకులను అటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కానీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ కానీ, ఇతర ముఖ్యనేతలు పెద్దగా పట్టించుకోలేదని అపవాదు ఉంది. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకూ ఎవరూ పెద్దగా ఐడెంటిటీ ఇవ్వలేదనే అభిప్రాయం ఇప్పటికీ చాలా మంది నేతల్లో నాటుకు పోయింది. ఎంతసేపు కేసీఆర్ పార్టీని, పెద్ద తలకాయలనే పట్టించుకున్నారని.. కింది స్థాయి నాయకత్వానికి పెద్దగా భరోసా ఇవ్వలేకపోయారని మండిపడుతున్నారు.అటు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. అప్పటి నుంచి అధినేత కేసీఆర్ కూడా తన ఫామ్‌హౌజ్ వదిలి ఇంతవరకు బయటకు వచ్చింది లేదు. కార్యకర్తలకు ధైర్యం కల్పించిందీ లేదు. కనీసం ఓటమిపై సమీక్షలు చేసిందీ లేదు. దాంతో పార్లమెంట్ ఎన్నికల్లోనూ అలాంటి చేదు ఫలితాలనే చవిచూడాల్సి వచ్చింది. కనీసం ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. దాంతో కేడర్‌లో మరింత అసంతృప్తి పెరిగింది. రెండు ఎన్నికల ఫలితాల్లోనూ పార్టీకి ఊహించని ఫలితాలు వచ్చినప్పటికీ పార్టీ పెద్దగా పట్టించుకోకపోవడం ఏంటని చాలా వరకు బీఆర్ఎస్ నేతల్లో ఆందోళన కనిపించింది. అటు.. నామినేటెడ్ పదవుల్లోనూ అన్యాయం జరిగిందనే అభిప్రాయం వారిలో ఉంది. కనీసం నేతలను కలిసేందుకు కూడా సమయం ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి.కట్ చేస్తే.. రాష్ట్రంలో మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. బీసీ కులగణన పూర్తయ్యాక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు బీఆర్ఎస్ నిత్యం జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. అయితే వీటికి కూడా కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతే తప్ప కేసీఆర్ వచ్చి కార్యకర్తలకు భరోసా ఇవ్వలేకపోతున్నారు. ఇదిలా ఉండగా.. అధికారంలో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని సెకండ్ కేడర్ లీడర్లు ఇప్పుడు పార్టీపై అసంతృప్తి తెలుపుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తాము గుర్తుకు రాలేదని.. ఇప్పుడు పార్టీ ఓడిపోవడంతో గుర్తుకు వచ్చామా అని వారి మధ్య చర్చ నడుస్తున్నట్లు టాక్. అప్పుడు గుర్తించకుండా.. ఇప్పుడు సమావేశాలకు పిలిస్తే ఎలా వస్తామని బాహాటంగానే ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అధికారం శాశ్వతం కాదని, కార్యకర్తలు, నాయకులే పార్టీకి ముఖ్యమన్న విషయాన్ని గుర్తించాలని సమావేశాలకు రాకుండా ఉండిపోతున్నారని తెలుస్తోంది.మరోవైపు.. నిన్న హన్మకొండ జిల్లా నేతలతో సమావేశమైన కేటీఆర్ సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లలో కార్యకర్తలను పట్టించుకోని అంశం నిజమేనని.. మరోసారి అలాటి తప్పు రిపీట్ కాకుండా చూసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీకి జవసత్వాలు తీసుకొద్దామని కోరారు. కార్యకర్తలు, నాయకుల్లో ఒక్కసారిగా ఇంతటి అసంతృప్తి రావడానికి నేతలకు కూడా ఇప్పుడిప్పుడే అర్థం అవుతున్నట్లుగా కనిపిస్తోంది. రాబోతున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ సెకండ్ కేడర్ లీడర్ల నుంచి ఇలాంటి సహాయ నిరాకరణ కనిపిస్తుండడంతో పార్టీ ముఖ్యనేతలంతా ఇప్పుడు ఆలోచనలో పడ్డారని సమాచారం.

# నెయ్యి విధానంపై తెలంగాణను ఫాలో అయితే మంచిది బాబు

హైదరాబాద్,శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీకి అవసరమైన ఆవునెయ్యి కొనుగోలుపై తిరుమల తిరుపతి దేవస్థానం అనుసరిస్తున్న పాత కాలం విధానాల్ని చాప చుట్టేసి విసిరేయాల్సిన సమయం వచ్చిందా? అంటే..అవునని చెప్పాలి. ఇప్పటివరకు పోటీతో ప్రైవేటుకు పెద్ద పీట వేస్తున్న వైనం తెలిసిందే. ఆవునెయ్యి తయారీలో జంతు కొవ్వు వినియోగ వ్యవహారం వెలుగు చూడటం.. పెద్ద వివాదంగా మారటం తెలిసిందే. ఇలాంటి వేళ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రియాక్టు అయ్యింది. తెలంగాణ వ్యాప్తంగా అధిక శాతం దేవలయాల్లోని లడ్డూలు.. ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిపై కీలక నిర్ణయాన్ని తీసుకుంది.దీని ప్రకారం.. ఇప్పటివరకు టెండర్ల పేరుతో ప్రైవేటు సంస్థలకు పెద్దపీట వేసే విధానానికి మంగళం పాడేశారు. ఇన్నాళు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కాకుండా ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేసే తీరుకు భిన్నంగా.. ఇకపై ప్రభుత్వ సంస్థ అయిన విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం డిసైడ్ అయ్యింది. అంతేకాదు.. ప్రభుత్వ సంస్థల్ని వదిలేసి.. ప్రైవేటు వద్ద కొనుగోళ్లు చేయటంపైనా ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.టెండర్లతో పని లేకుండా ఇకపై ఆలయాల్లో విజయ నెయ్యినే వినియోగించాలంటూ తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటివరకు అనుసరించిన విధానం ప్రాకరం ఏటా కోటి రూపాయిలకు పైగా ఆదాయం ఉన్నా దేవాలయాలు తెలంగాణ వ్యాప్తంగా 12 ఉంటే.. రూ.50 లక్షల నుంచి కోటి రూపాయిల ఆదాయం వచ్చే దేవాలయాలు 24 ఉన్నాయి. వీటిల్లో దాదాపు అన్ని ఆలయాల్లో లడ్డూ ప్రసాదం.. నెయ్యి కొనుగోలు అంశంపై ప్రైవేటుకు పెద్ద పీట వేస్తూ.. వారి నుంచే నెయ్యిని కొనుగోలు చేస్తున్నారు.తిరుమల లడ్డూ ఎపిసోడ్ నేపథ్యంలో తెలంగాణ ఆలయాల్లో నెయ్యి కొనుగోలుపై అనుసరిస్తున్న విధానాలపై ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఈ సందర్భంగా ఆసక్తికర అంశాల్ని గుర్తించింది. కమీషన్ల కక్కుర్తితో ప్రైవేటు సంస్థల నుంచి నెయ్యిని కొనుగోలుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్న వైనాన్ని గుర్తించింది. అంతేకాదు.. గతంలో విజయ డెయిరీ వద్ద నెయ్యిని కొనుగోలు చేస్తున్న ముంబయి సంస్థలు ప్రస్తుతం కొనుగోలు చేయటం లేదు.ఈ కారణంగా విజయ డెయిరీ వద్ద 50 టన్నులకు పైగా నెయ్యి నిలిచిపోయింది. ఈ నిల్వలు ఎక్కువ రోజులు ఉంటే నాణ్యత దెబ్బ తింటుందన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని దేవాలయాలు అన్నింటిలోనూ విజయ




నెయ్యి కొనుగోలు చేయాలంటూ విజయ సంస్థ ఎండీ లేఖలు రాసినా ఎలాంటి స్పందనా రాలేదు. ఈ అంశంపై ప్రభుత్వం వరకు వెళ్లింది. దీంతో స్పందించిన ప్రభుత్వం నెయ్యి కొనుగోలు విజయ డెయిరీ ద్వారానే జరగాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ ప్రైవేటు సంస్థల నుంచి కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో విజయ నెయ్యిని కొనుగోలు చేసేందుకు తెలంగాణలోని ఐదు దేవాలయాలు ముందుకు వచ్చాయి. ఆ 5 దేవాలయాలు.. వారు ఆర్డర్ చేసిన నెయ్యి ఎంతన్నది చూస్తే..

1. వేములవాడ దేవస్థానం 10వేల కేజీలు
2. బాసర 1500 కేజీలు
3. వరంగల్ భద్రకాళి 1050 కేజీలు
4. ధర్మపురి ఆలయం 980 కేజీలు
5. మంచిర్యాల వేంకటేశ్వర 105 కేజీలు

ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఏ రీతిలో అయితే నిర్ణయాన్ని తీసుకున్నదో.. అదే తరహాలో ఏపీలోని కూటమి సర్కారు సైతం అలాంటి నిర్ణయాన్ని తీసుకుంటే వివాదాలకు అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ.. ఏపీలోని ప్రభుత్వ రంగ డెయిరీలు ఉత్పత్తి చేసే నెయ్యి సరిపోదనుకుంటే.. ఇతర రాష్ట్రాల్లోని ప్రభుత్వ రంగం సంస్థల డెయిరీలతో ఒప్పందం చేసుకోవటం మేలైన చర్యగా చెప్పొచ్చు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ఎంత త్వరగా నిర్ణయం తీసుకుంటే అంత మచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కూటమిలో కుదుపులు ఖాయం!



విజయవాడ:కూటమిలో ఏం జరుగుతోంది? జనసేనలోకి వలసలను ప్రోత్సహిస్తున్నదెవరు? జగన్.. తన పార్టీ నేతలకు జనసేనలోకి పంపిస్తున్నారా? నేతల రాకతో జనసేనలో ఉక్కపోత మొదలైందా? గతంలోనూ వైసీపీ ఇలాంటి స్కెచ్ వేసిందా? వచ్చిన.. రానున్న నేతలతో టీడీపీ వర్సెస్ జనసేన అన్నట్లుగా మారిందా? మరి జనసేనను నమ్ముకున్న నేతల మాటేంటి? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతున్నాయి.ఏపీలో రాజకీయాలు వెరైటీగా నడుస్తున్నాయి. ఉనికి కోసం పోరాటం చేస్తోంది వైసీపీ. పార్టీని బలోపేతం చేసే పనిలో జనసేన నిమగ్నమైంది. వైసీపీలో లైఫ్ ఉండదని భావించి కీలక నేతలు జనసేన వైపు వస్తున్నారా? లేక జగన్ పంపిస్తున్నారా? అనేది సెకండ్ పాయింట్. జనసేన వైపు వస్తున్న నేతలంతా టీడీపీపై ఒంటి కాలుపై లేచినవారే. దీంతో సైకిల్ వర్సెస్ గ్లాసుగా రాజకీయాలు మారుతాయన్నది నేతల ఆలోచన.ఇప్పటికే ఒకరిద్దరు నేతలు వైసీపీ నుంచి జనసేనలో చేరారు. బాలినేని-టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల మధ్య అప్పుడే మాటల యుద్ధం మొదలైపోయింది. ఫ్యాన్ పార్టీ నేతలు జనసేనలోకి వచ్చినా, మా పోరాటం ఆగదన్నది దామచర్ల మాట. గడిచిన ఐదేళ్లు మా పార్టీ కార్యకర్తలు నరకం అనుభవించారన్నది ఆయన మాట.టీడీపీతో వైరం ఉన్న నేతలే ఇప్పుడు గ్లాసు పంచన చేరుతున్నారు. ఈ లెక్కన జగన్.. వలసలను ప్రోత్సహించినట్లే కనిపిస్తోంది. 2014-19 మధ్యకాలంలో జగన్ తన పార్టీలోని కొందరు నేతలను టీడీపీలోకి పంపారు. వారి ద్వారా కీలక విషయాలు తెలుసుకుని అలర్టయ్యేవారు. 2019 ఎన్నికల తర్వాత ఆయా నేతలంతా జగన్ గూటికి చేరుకున్న విషయం తెల్సిందే. ఈ లెక్కన జగన్ టార్గెట్ అంతా పవన్ కల్యాణ్ అన్నదే స్పష్టంగా అర్థమవుతుంది.ఇంతవరకు బాగానే ఉంది. మొదటి నుంచి జనసేనను నమ్ముకున్న నేతల మాటేంటి? ఈ విషయంలో పవన్ ఆలోచన ఎలా ఉంటుంది? వారికి న్యాయం చేస్తారా? అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీలోని నేతలను సముదాయించారు పవన్ కల్యాణ్. పార్టీని బలోపేతం చేసే పనిలో వలస నేతలకు ప్రయార్టీ ఇస్తారా? పార్టీని నమ్ముకున్నవారికి ఛాన్స్ ఇస్తారా? అన్నదే అసలు ప్రశ్న.కూటమి నామినేటెడ్ పదవుల్లో కొందరు గ్లాసు నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. కాకపోతే ఇప్పుడు కేటాయించినది కేవలం ఒకవంతు మాత్రమే కావడంతో సైలెంట్ అయ్యారట. పదవులు కేటాయింపు తర్వాత అసంతృప్త నేతలంతా బయటకు రావచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. రానున్న రోజుల్లో నామినేటెడ్ పోస్టులు-వలసల వ్యవహారం గాజు గ్లాసు పార్టీలో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# 'ఎన్సీపీతో పొత్తు బీజేపీ ఓటర్లకు ఇష్టం లేదు'..



ముంబై: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ (దేవేంద్ర ఫడ్నవీస్) గురువారం సంచలన వ్యాఖ్యలు చేశారు. అజిత్ పవార్‌ని ఎన్సీపీతో పొత్తు పెట్టుకోవడం బీజేపీ ప్రధాన ఓటర్లకు ఇష్టం లేదని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీ తిరోగమనానికి ఇది ప్రధాన కారణమని అన్నారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చెత్త ప్రదర్శన ఇదేనని చెప్పారు. సీఎం షిండే శివసేన, బీజేపీ, అజిత్ పవార్ ఎన్సీపీ కలిసి 28 స్థానాల్లో పోటీ చేశానని చెప్పారు. అయితే అధికారంలో ఉన్న తమ కూటమికి చాలా తక్కువ సీట్లు వచ్చాయన్నారు.కాగా, షిండే శివసేన (7), అజిత్ పవార్ ఎన్సీపీ (1) కంటే బీజేపీకి ఎక్కువ సీట్లు వచ్చాయనీ, 9 సీట్లు గెలుచుకున్నట్లు దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. విడిపోయిన ఆ రెండు పార్టీలు ఒక విధంగా కొత్త పార్టీలని చెప్పారు. స్థిరమైన ఓటర్లు లేకపోవడం లోక్‌సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు కష్టంగా మారింది. 'ఎన్సీపీతో పొత్తు పెట్టుకోవడం బీజేపీ 'కోర్ ఓటర్ బేస్'కు నచ్చలేదు' అని అన్నారు.

# డీజే శబ్దాలు శృతి మించుతున్నాయి..



హైదరాబాద్,డీజే శబ్దాలు శృతిమించిపోతున్నాయని.. వాటిని కట్టడి చేయాల్సిన అవసరం లేదని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డీజేపీలు, టపాసుల వినియోగంపై ఆయన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జీహెచ్ఈసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్‌లు. అలాగే రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.డీజేలతో నివాసాల్లో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని.. గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారు. రానురాను డీజే శబ్దాలు శృతి మించిపోతున్నాయని.. గణేశ్ ఉత్సవాలతో పాటు మిలాద్ ఉన్ నబీ సమయంలోనూ డీజేలతో నృత్యాలు విపరీతమయ్యాయని. పబ్‌లలో నృత్యాలు చేసినట్లు ర్యాలీల్లో చేస్తున్నారన్నారు. ఈ డీజేలను నియంత్రించకపోతే ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం. ఆరోగ్య సమస్యలతో పాటు భద్రతకు సైతం ముప్పు సూచన. డీజే శబ్దాలను కట్టడి చేయడానికి అనేక సంఘాలు ఫిర్యాదు చేశాయన్నారు. ఈ విధంగానే అందరి అభిప్రాయాలను తీసుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని.. అందుకే అన్ని వర్గాలను సమావేశానికి ఆహ్వానించారు. అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని.. ఆ తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల రద్దు బిజెపి లక్ష్యం

న్యూఢిల్లీ,రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేసేందుకు కాషాయ పార్టీ వెనకాడదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిందంబరం వ్యాఖ్యానించారు. ఎప్పటికైనా బిజెపి రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, కేంద్రంలో భాజపా సర్కార్‌పై .చిందంబరం తీవ్ర ఆరోపణలు చేశారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని.. భాజపా మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై అడిగిన ప్రశ్నకు చిదంబరం స్పందించారు. రాజ్యాంగాన్ని భాజపా కచ్చితంగా సవరిస్తుంది. అందుకోసం వారు ప్రయత్నిస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు విఘాతం కలిగిస్తుందని ఆరోపించారు. డిజిటల్ లావాదేవీలు భారత్ సాధించిన పురోగతిని ఉద్దేశిస్తూ మోదీ సర్కార్‌ను చిదంబరం అభినందించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com